



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక






సంపుటి: 5 సంచిక: 211, పేజీలు - 08

బుధవారం, జనవరి 14, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## జిల్లాల పునర్విభజనతో

# రాజకీయ చదరంగం

### - రేవంత్ రెడ్డి రిస్క్ చేస్తున్నారా.?

(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)

తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ తేనెతుట్టెను కదిలించడం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహాలు ఉన్నాయని అనుకోవచ్చు. అయితే ఇది కత్తిమీద సాము లాంటిదే.

**గతంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన**

తెలంగాణలో గత ప్రభుత్వం 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చిన ప్రక్రియలో అనేక అశాస్త్రీయ కోణాలు ఉన్నాయని భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వాటిని సరిదిద్దేందుకు నడుం బిగించారు. అయితే, ఈ ప్రకటన వెలువడిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా సెంటిమెంట్ రాజకీయాలు రాజుకున్నాయి.

తమ జిల్లా ఉనికి కోల్పోతుందని లేదా పేరు మారుతుందని భావిస్తున్న పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిరసనలు మొదలయ్యాయి. ఈ సున్నితమైన అంశాన్ని ఎదుర్కోవడానికి రేవంత్ రెడ్డి ప్రధానంగా న్యాయపరమైన రక్షణ, ప్రజాభిప్రాయం అనే రెండంచుల వ్యూహాన్ని అమలు చేయబోతున్నారు. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ వేయడం ద్వారా, ఈ ప్రక్రియ రాజకీయ ప్రేరేపితం కాదని, పూర్తిగా నిపుణుల సలహా మేరకే జరుగుతోందని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆయన ఎత్తుగడ.

2లో..

## ఆపరేషన్ సిందూర్‌ను కచ్చితత్వంతో

# అమలు చేశాం

### - ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్ పై భారత ఆర్మీ చీఫ్ భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సంచలన ప్రకటన చేశారు. పాకిస్తాన్ తో యుద్ధానికి శ్రీకారం చుట్టిన గత ఏడాది మే 10వ తేదీ నుండి ఇప్పటివరకు 31మంది పాకిస్తాన్ ప్రోత్సాహిత ఉగ్రవాదులను హతమార్చామని అన్నారు. వీరిలో 65 శాతం మంది పాకిస్తాన్ సంతతికి చెందినవారేనని తేల్చి చెప్పారు. వీరిలో పహల్గామ్ దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను ఆపరేషన్ మహాదేవ్ సందర్భంగా కాల్చి చంపినట్లు వెల్లడించారు. తాజాగా ఉపేంద్ర ద్వివేదీ ఢిల్లీలో విలేకరుల



2లో..

## పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఎత్తుగడలు

- మీడియా సంస్థలపై దర్యాప్తు పేరుతో వేధించడం సరికాదని హెచ్చరిక
- కాంగ్రెస్ నేతల అవినీతి, కబ్జాలపై విచారణ ఏదని సూటి ప్రశ్న



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రభుత్వం తరచూ కమిషన్‌లు, ప్రత్యేక దర్యాప్తు

2లో..

# దేవాన్ష్ ఆట, చంద్రబాబు మాట

### - నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్, బ్రాహ్మణి పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు బహుమతులు ప్రదానం చేశారు. మరోవైపువివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను అందుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు**

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారా వారిపల్లెలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబం సంక్రాంతి సంబరాల్లో పాల్గొంది. ఈ సంబరాల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి నారా

2లో..

## తెలంగాణ మున్సిపల్ ఓటర్ల

# తుది జాబితా

### - మహిళా ఓటర్లదే పైచేయి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఎన్నికల సంఘం దాదాపుగా పూర్తిచేస్తోంది. ఓటర్ల వివరాలను దాదాపుగా ఫైనల్ చేసింది. రాష్ట్రంలోని మొత్తం 123 మున్సిపాలిటీల పరిధిలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఈ గణాంకాల ప్రకారం, మొత్తం 2,996 వార్డుల్లో కలిపి 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును కలిగి ఉన్నారు. గతంతో పోలిస్తే పట్టణ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. మున్సిపల్ ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది.



2లో..

## లేడీ ఐఏఎస్‌ను కించపరిచిన కేసులో ట్విస్ట్

### - సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

2లో..




## కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారంలో వాస్తవం లేదు

- కవిత ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్న టీపీసీసీ చీఫ్
- కాంగ్రెస్ నాయకులే అసలైన హిందువులు అన్న మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కల్వకుంట్ల కవిత చుట్టూ జరుగుతున్న పరిణామాలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే వార్తలు సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారమయ్యాయి. ఈ ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత కాంగ్రెస్ తీర్థం

3లో..



## ఏపీలో అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

### - చట్టానికి సవరణ చేస్తూ ఉత్తర్వులు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ల చట్టానికి సవరణలు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా నకిలీ పత్రాలను సృష్టించి

2లో..










## వీబీ జీరామ్ జీ" పథకంతో తెలంగాణకు

# అదనంగా 340కోట్ల రూపాయలు

## – కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందన్న బండి సంజయ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రామాలకు ఆస్తులను సృష్టించే పథకం, ప్రతి ఒక్కరికి 125 రోజుల పనిని కల్పించే పథకం, నేరుగా డబ్బులు రైతుల కూలీల ఖాతాలోనే పడే పథకమైన "వీబీ–జీ రామ్ జీ" పథకం పై కాంగ్రెస్ అక్కసు వెళ్ళగక్కుతుంది అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకం వల్ల తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు రాబోతున్నాయి అని, దీనివల్ల తెలంగాణకు మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఇదొక అద్భుత పథకం : బండి సంజయ్

ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్చుకోలేక పోతుందని ఆయన అసహనం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "వీబీ–జీ రామ్ జీ" పథకం గ్రామీణ పేదల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చే అద్భుతమైన పథకమని పేర్కొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ పథకం ద్వారా ఉపశమనం లభిస్తుందని అన్నారు.

### తెలంగాణాకు అదనంగా రూ.340 కోట్లు

కరీంనగర్‌లోని త్రిధా హొటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ఈ నూతన చట్టబద్ధ ఉపాధిహామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అదనంగా రూ.17వేల కోట్లు ఖర్చు చేయబోతోందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి సైతం గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.340కోట్లు అదనంగా రానున్నాయని తెలిపారు. ఈ పథకం కింద ఏటా రూ.1.51లక్షల కోట్లకు పైగా వ్యయం అవుతుందని ప్రభుత్వ అంచనాలను వెల్లడించారు.

### కాంగ్రెస్ ది అనవసరపు రాద్ధాంతం

ఇంత మంచి పథకం కేంద్ర అమలు చేస్తుంటే కాంగ్రెస్ అనవసరపు రాద్ధాంతం చేస్తుందని ఆయన అన్నారు. "వీబీ జీ రామ్ జీ" పథకం కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో అమలవుతుందని, ఇందులో కేంద్రం వాటా రూ.95,692 కోట్లు కాగా, రాష్ట్రాల వాటా కలిపి రూ.55,589 కోట్లు ఉంటాయని వివరించారు. గ్రామ సభల ద్వారా పనుల ఎంపిక జరగడం వల్ల గ్రామానికి అవసరమైన పనులు ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు.

### మీరు పథకాల పేర్లు మార్చలేదా

కేంద్ర ప్రభుత్వం గైడ్‌గా మాత్రమే వ్యవహరిస్తుందని, ఎలాంటి అజమాయిషీ ఉండదన్నారు. పథకానికి గాంధీ పేరును తీసేయడంపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే పథకాల పేర్లు మార్చిన ఉదాహరణలను గుర్తు చేశారు. మహాత్ముడి ఆశయాలను తుంగలో తొక్కిన వాళ్లే ముసలి కన్నీరు కారుస్తున్నారు అంటూ మండిపడ్డారు. వాంబే ఇళ్ల స్కీమ్ పథకంలో వాల్మీకి, అంబేద్కర్ పేర్లను ఎందుకు తొలగించారో చెప్పాలని ప్రశ్నించారు.

### కాంగ్రెస్ వి నీచ రాజకీయాలు

ఎయిర్ పోర్ట్ కు ఎన్టీఆర్ పేరును తొలగించి రాజీవ్ గాంధీ పేరు పెట్టలేదా అంటూ నిలదీశారు. మీరు చేస్తే సంసారం మేము చేస్తే వ్యభిచారమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరిగే ఈ నూతన పథకం కావాలా వద్దా అంటూ బండి సంజయ్ ప్రజలను ప్రశ్నించారు. వి బి జి రామ్ జీ పథకం పైన రాజకీయాలు చేయడం కాంగ్రెస్ నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి, రైతులకు మేలు చేసే ఈ పథకాన్ని అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశారు.



# దేవాన్ష్ ఆట, చంద్రబాబు మాట

భువనేశ్వరి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయన సతీమణి నారా బ్రహ్మణి, తనయుడు నారా దేవాన్ష్‌లు సైతం పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించారు.

### చిన్నారులతో ఆడిన చంద్రబాబు మనవడు

అనంతరం స్థానికంగా వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులతో నిర్వహించిన క్రీడా పోటీలను చంద్రబాబు నాయుడు కుటుంబం వీక్షించింది. చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్ ఫైట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ వంటి పలు క్రీడలను నిర్వహించారు. వీటన్నింటినీ సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబం ఆసక్తిగా తిలకించి సంతోషంగా గడిపింది.
ఈ క్రీడలలో చంద్రబాబు నాయుడు,అగ్రహీరో బాలకృష్ణల మనవళ్లు కూడా పాల్గొన్నారు. క్రీడాపోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి.వివిధ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు సీఎం చంద్రబాబు నాయుడు బహుమతులు అందజేశారు.

### ముగ్గులను పరిశీలించిన సీఎం

చిన్నారులందరితో ఫోటోలు దిగి ఆప్యాయంగా సీఎం చంద్రబాబు నాయుడు ముచ్చటించారు. దాదాపు రెండు గంటల సేపు గ్రామస్తులు, చిన్నారులతో సీఎం చంద్రబాబు నాయుడు గడిపారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి వారికి బహుమతులు అందజేశారు.

### సార్లంకపల్లెలో అగ్నిప్రమాదంపై చంద్రబాబు ఆరా

కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో అగ్నిప్రమాదంపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పండుగ సమయంలో సార్లంకపల్లెలో అగ్ని ప్రమాదం పెను విషాదం తెచ్చిందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఊరిలో ఉన్న మొత్తం 38 తాటాకు ఇళ్లు కాలిపోయిన ఘటనలో బాధితులకు అన్ని విధాలుగా సహాయం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని హోం మంత్రి అనిత, ఇతర అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు.

### తక్షణ సాయంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25వేలు సాయం అందించాలని ఆదేశం

అగ్నిప్రమాద బాధితులు ఇబ్బంది పడకుండా వసతి, ఆహారం అందించి వారికి అండగా నిలవాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

తక్షణ సాయంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 వేలు నేడు అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇల్లు కోల్పోయిన ప్రతి బాధిత కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. కొత్త ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు వారికి అవసరమైన వసతి, ఇతర సహాయం అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. బాధితులకు అందే సహాయాన్ని జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# లేడీ ఐఏఎస్‌ను కించపరిచిన కేసులో ట్విస్ట్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు అసభ్యంగా, అనుచితంగా, దూషణాత్మకంగా వార్తలు, వ్యాఖ్యలు చేసిన ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది.లేడీ ఐఏఎస్ ఆఫీసర్‌ని కించపరిచేలా పలు మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో నారాయణపేట జిల్లా మద్దూరులో కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసుల దర్యాప్తుకు సంబంధించి డీజీపీ శివధర్ రెడ్డి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ఏర్పాటు చేశారు. మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తాకథనాలు ప్రచారం చేశారని ఆరోపిస్తూ తెలంగాణ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సీసీఎస్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు దర్యాప్తునకు సిట్‌ను డీజీపీ శివధర్ రెడ్డి ఏర్పాటు చేశారు.మరోవైపు సీఎం రేంత్ రెడ్డి ఫోటోను అసభ్యకరంగా పోస్టు చేశారంటూ ఫిర్యాదుపై నమోదు అయిన కేసును కూడా విచారించాలని డీజీపీ ఆదేశించారు.

### లేడీ ఐఏఎస్ ఆఫీసర్ కేసులో కీలక పరిణామం

తెలంగాణలో లేడీ ఐఏఎస్ ఆఫీసర్‌ను కించపరిచేలా పలు మీడియాలో వచ్చిన కథనాలు, నారాయణపేట జిల్లా మద్దూరులో నమోదైన కేసుల్లో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేశారు.మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను అసభ్యకరంగా పోస్టు చేశారని కావలి వెంకటేశ్ పై కాంగ్రెస్ నేత గుళ్ల నరసింహా ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11న కేసు నమోదు అయింది. మహిళా ఐఏఎస్ ను కించపరిచేలా వార్తా కథనాలు ప్రచారం చేశారని తెలంగాణ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది.మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను అసభ్యకరంగా పోస్టు చేశారని కావలి వెంకటేశ్ పై కాంగ్రెస్ నేత గుళ్ల నరసింహా ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 11న కేసు నమోదు అయింది. ఈ రెండు కేసులపై దర్యాప్తు చేపట్టేందుకు హైదరాబాద్ సిటీ సీపీ వి.సి సజ్జనార్ నేతృత్వంలో 8 మంది సభ్యులతో సిట్‌ను డీజీపీ శివధర్ రెడ్డి ఏర్పాటు చేశారు.

### సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ నేతృత్వంలో డీజీపీ ఏర్పాటు చేసిన సిట్ బృందంలో పలువురు ఐపీఎస్‌లు సైతం ఉన్నారు.సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకట లక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీబీ అరవింద బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్ సెల్ సీఐ శంకర్ రెడ్డి, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఎస్ఐ హరీశ్‌లు ఉన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు అసభ్యకరంగా పోస్టు చేసి తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారని కావలి వెంకటేశ్ పై కాంగ్రెస్ నేత గుళ్ల నరసింహ ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదుపై ఈ నెల 11న కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో ఈ రెండు కేసుల దర్యాప్తును వేగంగా పూర్తి చేసి, చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సిట్‌ను డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశించారు.

### రెండు కేసులను విచారించనున్న సిట్

మహిళా ఐఏఎస్ అధికారిణి కించపరిచే వార్తలు టెలికాస్ట్ పై కేసు నమోదు అయ్యింది.ఈ మేరకు ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేష్ రంజన్ ఫిర్యాదుతో కేసు నమోదు అయ్యింది.లేడీ ఐఏఎస్ అధికారినిపై కథనాలు ప్రచారం చేసిన రెండు తెలుగు న్యూస్ ఛానళ్ళు, 7 యూట్యూబ్ ఛానల్‌ల పై మద్దూరు పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఫోటో మార్ఫింగ్ ల పై కాంగ్రెస్ నేత గుళ్ళ నరసింహా ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను సిట్ బృందం దర్యాప్తు చేయనున్నారు.

# ఏపీలో అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

నిషేధిత భూములను క్రయవిక్రయాలు జరిపే మాఫియాపై ఉక్కుపాదం మోపేలా ప్రభుత్వం ఈ కొత్త నిబంధనలను రూపొందించింది. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా వెలుగుచూస్తున్న భూ కుంభకోణాలు, నిషేధిత భూముల రిజిస్ట్రేషన్, చట్టపరమైన లోపాలను సరిదిద్దేందుకే ఈ సవరణలు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

### అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయడానికి ప్రత్యేక కమిటీ

అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయడానికి వీలుగా జిల్లా స్థాయిలో ఒక శక్తివంతమైన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పనిచేసే ఈ ప్రత్యేక కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఎక్కడైనా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు అందినా లేదా ప్రభుత్వ పరిశీలనలో తేలినా, ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ జరుపుతుంది. నివేదికల ఆధారంగా సదరు రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం ఇకపై జిల్లా కలెక్టర్లకు ఉంటుంది. దీనివల్ల బాధితులకు సత్వర న్యాయం చేకూరడంతో పాటు, ప్రభుత్వ భూముల రక్షణకు వీలవుతుంది.

### అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు

కేవలం క్రయవిక్రయదారులపైనే కాకుండా, అవినీతికి పాల్పడే అధికారులపై కూడా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. రిజిస్ట్రేషన్ చేసే అధికారి కావాలని నిబంధనలను అతిక్రమించినా, నకిలీ పత్రాలు అని తెలిసి కూడా నిషేధిత భూములను రిజిస్టర్ చేసినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. బాధ్యులైన అధికారులను సర్వీసు నుంచి తొలగించడంతో పాటు భారీ జరిమానాలు విధించేలా నిబంధనలను కఠినతరం చేశారు. ఇది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శకతను పెంచుతుందని భావిస్తున్నారు.

### ఏపీలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సురక్షితం

ఈ తాజా చట్ట సవరణతో ఆంధ్రప్రదేశ్‌లో భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సురక్షితంగా మారనుంది. సామాన్యుల భూములను కబ్జా చేసే ప్రయత్నాలకు, ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చే అక్రమాలకు ఈ నిర్ణయంతో చెక్ పడనుంది. జిల్లా కలెక్టర్ స్థాయిలోనే రద్దు ప్రక్రియ ముగియడం వల్ల కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే బాధితులకు ఊరట లభిస్తుంది. రెవెన్యూ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచేలా సాయిప్రసాద్ గారు విడుదల చేసిన ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయి.

## జిల్లాల పునర్విభజనతో రాజకీయ చదరంగం

### పరిపాలనా సౌలభ్యం కోసమే మార్పులు

అసలు రేవంత్ రెడ్డి ఈ వివాదాస్పద అంశాన్ని ఎందుకు కదిలిస్తున్నారు అనే ప్రశ్నకు పరిపాలనా సౌలభ్యం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కేవలం 5 నుంచి 10 మండలాలతో ఏర్పాటైన చిన్న జిల్లాల్లో కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు ఇతర మౌలిక వసతుల నిర్వహణ ప్రభుత్వ ఖజానాపై భారంగా మారింది. అలాగే, రెవెన్యూ డివిజన్లు ఒక జిల్లాలో, పోలీస్ పరిధి మరో జిల్లాలో ఉండటం వంటి సాంకేతిక లోపాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. వీటిని సరిదిద్దడం ద్వారా కనిష్ట ప్రభుత్వం – గరిష్ట పాలన సూత్రాన్ని అమలు చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇది దీర్ఘకాలంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి, అభివృద్ధి పనులకు నిధులు మళ్లించేందుకు దోహదపడుతుందని రేవంత్ సర్కార్ నమ్ముతోంది.

### అఖిలపక్ష సమావేశం కూడా ఏర్పాటు

వ్యతిరేకతను ఎదుర్కోవడానికి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న మరో ప్రధాన ఆయుధం అఖిలపక్ష సమావేశం . కమిటీ నివేదిక వచ్చిన తర్వాత నేరుగా నిర్ణయం తీసుకోకుండా, అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలతో చర్చించబోతున్నారు. దీనివల్ల, రేపు ఏదైనా జిల్లా రద్దయినా లేదా విలీనమైనా ఆ నెపాన్ని కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంపైకి రాకుండా, అందరి అంగీకారంతో జరిగిందని చెప్పే అవకాశం ఉంటుంది. అలాగే, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం ద్వారా స్థానిక సెంటిమెంట్‌ను గౌరవిస్తున్నామనే సంకేతాలను బలంగా పంపాలని ఆయన యోచిస్తున్నారు.

### కత్తిమీద సాములా ప్రక్రియ

రాజకీయ కోణంలో చూస్తే.. జిల్లాల విభజన ద్వారా క్షేత్రస్థాయిలో కొత్త సమీకరణాలకు రేవంత్ రెడ్డి బీజం వేస్తున్నారు. గత ప్రభుత్వం తమకు అనుకూలమైన నేతల కోసం జిల్లాల సరిహద్దులు గీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వాటిని మార్చడం ద్వారా ప్రతిపక్ష పార్టీల పట్టు ఉన్న ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధించే అవకాశం కూడా ఉంది. అయితే, ఈ ప్రక్రియలో ఏదైనా చిన్న పొరపాటు జరిగినా అది ప్రాంతీయ ఉద్యమాలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజల సెంటిమెంట్‌ను సరిగ్గా మేనేజ్ చేయలేకపోతే అది రాజకీయంగా ప్రభుత్వానికి సవాలుగా మారుతుంది.

## ఆపరేషన్ సిందూర్‌ను కచ్చితత్వంతో అమలు చేశాం

సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది మే 10 నుండి వెస్టర్న్ ఫ్రంట్, జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల వెంబడి పరిస్థితి సమస్యాత్మకం, సున్నితంగానే ఉందని అన్నారు. భద్రత బలగాలు ఎప్పటికప్పుడు కూంబింగ్ నిర్వహిస్తోన్నాయని, దీనివల్ల సరిహద్దు గ్రామాల్లో చెలరేగిన ఉద్రిక్త వాతావరణం నియంత్రణలో ఉందని స్పష్టం చేశారు. జమ్మూ కాశ్మీర్ లో క్రియాశీలంగా ఉన్న స్థానిక ఉగ్రవాదుల సంఖ్య చాలావరకు తగ్గిందని, దాదాపుగా సింగిల్ డిజిట్‌కు చేరిందని ఉన్నారు.2025లో జమ్మూ కాశ్మీర్ కు చెందిన ఇద్దరు స్థానికులు మాత్రమే ఉగ్రవాద సంస్థల్లో చేరారని ఉపేంద్ర ద్వివేది అన్నారు. అభివృద్ధి కార్యకలాపాలు, పర్యాటక రంగం పునరుద్ధరణ వంటి చర్యల వల్ల ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గాయని, అమర్‌నాథ్ యాత్రలో అయిదేళ్ల సగటు కంటే అధికంగా నాలుగు లక్షలకు పైగా యాత్రికులు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆపరేషన్ సింధూర్ 2 ఇప్పుడూ కొనసాగుతోందని, పాకిస్తాన్ ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా సరే.. సైనిక చర్యకు దిగుతామని ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. ఎటువంటి తప్పిదానికి పాల్పడినా ధీటుగా బదులిస్తామని ఆయన హెచ్చరించారు. పాకిస్తాన్‌లో ఎనిమిది ఉగ్రవాద శిబిరాలు ఉన్నాయని, వాటిల్లో ఎల్‌ఓసీ, మరో రెండు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్నాయని తెలిపారు. వీటిద్వారా ఎటువంటి చర్యలకు పాల్పడినా పాకిస్తాన్ కు మరోసారి పరాభం తప్పదనీ తేల్చి చెప్పారు. సంప్రదాయ యుద్ధ కార్యకలాపాలకు అవకాశం తగ్గిపోయి, నేరుగా అణు రంగంలోకి వెళ్తామని అందరూ భావించారని, దీనికి భిన్నంగా వ్యవహరించామని పేర్కొన్నారు. యుద్ధ రీతుల్లో సంప్రదాయ కార్యకలాపాల పరిధిని మరింత విస్తరించుకున్నామని వివరించారు. డీజీఎంఓ చర్చల్లో అణు ప్రస్తావన రాలేదని ఉపేంద్ర ద్వివేది ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. పాకిస్తాన్ రాజకీయ నాయకులు, అక్కడి ప్రజలే దీని గురించి మాట్లాడారని, మిలటరీ నుండి అలాంటి సూచనలేవీ తనకు అందలేదని స్పష్టం చేశారు. యుద్ధం కొనసాగిన ఆ 88 గంటల్లో సంప్రదాయ యుద్ధ కార్యకలాపాల పరిధిని విస్తరించడానికి అసాధారణంగా సైన్యాన్ని సమీకరించుకున్నామని తెలిపారు. పాకిస్తాన్ ఏ మాత్రం తప్పు చేసినా, మళ్లీ ఆపరేషన్ ప్రారంభించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పహల్గామ్ దాడి తర్వాత 22 నిమిషాల్లో 'ఆపరేషన్ రీసెట్ల వ్యూహం అమలు చేశామని ద్వివేది చెప్పారు. చైనాతో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి, అలాగే ఉత్తర సరిహద్దుల్లోనూ పరిస్థితి స్థిరంగా ఉన్నా నిరంతర నిఘా అవసరమని పేర్కొన్నారు. బారత్–మయన్మార్ సరిహద్దుల్లో అస్సాం రైఫిల్స్, ఆర్మీ, హోం మంత్రిత్వ శాఖలతో కూడిన సమగ్ర మల్టీ సెక్యూరిటీ గ్రిడ్ పహారా కాస్తోందని, ఈశాన్య ప్రాంతాన్ని స్పిల్‌ఓవర్ ప్రభావాల నుండి రక్షించడానికి కృషి చేస్తోందని తెలిపారు.

## పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఎత్తుగడలు

బృందాల (సిట్) పేరుతో 'అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు' ఆడుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఒక మంత్రికి సంబంధించిన వార్తను ఉటంకించినందుకు మీడియా సంస్థలపై సిట్ వేయడాన్ని తప్పుబట్టిన కేటీఆర్, సొంత పార్టీ నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలపై మాత్రం ఎందుకు విచారణ జరపడం లేదని సూటిగా ప్రశ్నించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయని చెబుతున్న పలు ఘటనలను కేటీఆర్ తన ప్రకటనలో ఏకరవు పెట్టారు. "ఒక మంత్రి పీఏ, రేవంత్ సహచరుడు కలిసి పారిశ్రామికవేత్త తలకు తుపాకి పెట్టి రూ.300 కోట్లు డిమాండ్ చేస్తే దానిపై సిట్ లేదు. ములుగు జిల్లాలో మంత్రి పీఏ ఇసుక దందాలో కోట్లు దండుకుంటే చర్యలు లేవు. రెవెన్యూ మంత్రి కుమారుడు వందల కోట్ల భూకబ్జాకు పాల్పడితే, కేసు పెట్టిన పోలీస్ అధికారి బదిలీ అయ్యారు కానీ, కబ్జాపై విచారణ లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.

అంతేకాకుండా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఓ కాంట్రాక్టర్‌ను రూ.8 కోట్ల కోసం బెదిరించారని, కస్తూర్బా గాంధీ పాఠశాలల బంకర్ బెడ్స్ కొనుగోలులో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ వివాదం, చీప్ లిక్కర్ కంపెనీలకు అక్రమ అనుమతులు వంటి అనేక స్కామ్‌లపై ప్రభుత్వం ఎందుకు సిట్ వేయలేదని ఆయన నిలదీశారు. యూనివర్సిటీ భూముల అమ్మకంలో భారీ మోసం జరిగిందని సుప్రీంకోర్టు కమిటీయే తేల్చినా విచారణ జరపకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు."అధికార పక్షానికి సన్నిహితంగా ఉండే ఓ టీవీ ఛానెల్ వేసిన వార్తను కేవలం ఉటంకించినందుకు అనేక ఛానెళ్లపై, డిజిటల్ మీడియాపై సిట్ ఏర్పాటు చేశారు. అసలు వార్త వేసిన వారిని వదిలేసి, ఈ కొత్త డ్రామా ఎవరిని కాపాడటానికి? ఎవరిని వేటాడటానికి?" అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రశ్నించే మీడియా గొంతుకలపై వేధింపులు ఆపకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

## తెలంగాణ మున్సిపల్ ఓటర్ల

# తుది జాబితా

మొత్తం 123 మున్సిపాలిటీలకు గానూ ఏకంగా 113 మున్సిపాలిటీల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఓటర్లలో 51.1 శాతం మంది మహిళలు ఉండగా, వీరి సంఖ్య 26,80,014 గా ఉంది. పురుష ఓటర్లు 25,62,369 (48.9 శాతం) ఉండగా, ఇతరులు 640 మంది ఉన్నారు.

పట్టణ ఓటర్ల జాబితాను నిశితంగా గమనిస్తే, పురుషుల కంటే మహిళలు దాదాపు 1.17 లక్షల మంది ఎక్కువగా ఉన్నారు. కేవలం 10 మున్సిపాలిటీల్లో మాత్రమే పురుష ఓటర్లు ఆధిక్యంలో ఉండగా, మిగిలిన చోట్ల మహిళలే నిర్ణాయక శక్తిగా మారనున్నారు. ఈ గణాంకాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల వ్యూహాలను మార్చే అవకాశం ఉంది.ఎన్నికల సంఘం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు పట్టణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన అధికారులు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

నిర్ణాయక శక్తిగా ఉన్న మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు మరియు కొన్ని కార్పొరేషన్లకు సంబంధించి ఫిబ్రవరి లేదా మార్చి లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.
ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన గణన ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే, జనవరి నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. ప్రస్తుతం స్పెషల్ ఆఫఈసర్ల పాలనలో ఉన్నాయి.

# ఈ ఆఫీస్ అమలులో అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు

**- సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడేదిలేదు**
**- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ స్పష్టీకరణ**
**- జిల్లా అధికారులతో సమీక్ష**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఈ–ఆఫీస్ (కాగిత రహిత) విధానంలో అధికారిక కార్యకలాపాలు నిర్వహించని వైద్యులు, అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, ఆర్జేడీ కార్యాలయాల వరకు అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, వైద్య, ఇతర సిబ్బంది సర్వీస్ వ్యవహారాలు, డిస్పాచింగ్, అనుమతులు, ఇతర పరిపాలనా పరమైన అంశాలపై ఈ–ఆఫీస్ విధానంలోనే కార్యకలాపాలు కొనసాగాలని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా జరిగే కార్యకలాపాలను అనధికారికమైనవిగా గుర్తిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మంగళవారం వర్చువల్ విధానంలో జరిగిన సమావేశంలో వీరపాండియన్ తేల్చిచెప్పారు. ఈ–ఆఫీసు విధానం అమలుపై జారీచేసిన ప్రభుత్వ ఆదేశాలను అనుసరించని వారిని అవసరమైతే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడేదిలేదని వెల్లడించారు. తప్పని పరిస్థితుల్లోనే కోర్టు కేసుల వ్యవహారాలు, బ్యాంకు చెక్కుల వరకు మాత్రమే ఫిజికల్ ఫైల్స్ ఉండాలని చెప్పారు మిగిలిన అన్ని రకాల దస్త్రాలు ఈ–ఆఫీస్ ద్వారా మాత్రమే కొనసాగాలని జిల్లా అధికారులకు వీరపాండియన్ స్పష్టంచేశారు. ఈ ఆఫీస్ విధానం ఈ నెల ఏడో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు.

### డిస్ట్రిక్ట్స్ వారీగా నోడల్ ఆఫీసర్లు

కొత్త విధానం కోసం జిల్లాల వారీగా నియమించిన రాష్ట్ర నోడల్ అధికారులు ఈ–ఆఫీస్ విధానం అమలులో అలసత్వాన్ని ప్రదర్శించే వారి గురించి తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సాంకేతి సమస్యలు తలెత్తితే సదరు అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ఈ–ఆఫీస్ విధానం అమలుపై యథస్థితిని ఎప్పటికప్పుడు తెలియచేస్తున్నామని వెల్లడించారు. ఆసుపత్రుల్లో రోగులు వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లోనే నమోదు కావాలని స్పష్టం చేశారు.

### నిధులను వ్యయంచేయాలి

జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా విడుదలైన నిధులను అవసరాలు, ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి వెంటనే ఖర్చు పెట్టాలని కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. లేకుంటే తదుపరి నిధులను జారీచేయడం జరగదని స్పష్టంచేశారు.

### పదోన్నతుల చర్యలు తీసుకోవాలి!

అర్హులైన ఉద్యోగులు, అధికారులకు వెంటనే పదోన్నతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సహేతుక కారణాలు లేకుండా పదోన్నతుల నిర్వహణలో జాప్యంచేస్తే మాత్రం క్రమశిక్షణ చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

### ఖాళీలు భర్తీచేయాలి!

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు, స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు స్పష్టంచేశారు. ఈ నియామకాలు పూర్తికానందువల్ల సదరు పీహెచ్సీల పనితీరు వెనుబడినట్లు ఐవీఆర్ఎస్ ఫీడ్బ్యాక్లో కనిపిస్తుందని కమిషనర్ తెలిపారు.

# సంక్రాంతి నాటికి రైతుల ఖాతాల్లో రూ.10,000 కోట్లకు పైగా జమ

**- స్పీడ్ ఆఫ్ డెలివరీ గవర్నెన్స్‌కు నిదర్శనం**
**- ధాన్యం కొనుగోలులో చారిత్రక విజయం సాధించిన కూటమి ప్రభుత్వం-**
**- అమరావతిపై జగన్మోహన్ రెడ్డి ది దుష్ప్రచారం-**
**- రాష్ట్ర ప్రజలకు, రైతు సోదరులకు సంక్రాంతి**
**- శుభాకాంక్షలు తెలిపిన : మంత్రి నాదెండ్ల మనోహర్**



**తెనాలి (ప్రశ్న న్యూస్)** ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను, రాష్ట్రంలో ఇప్పటివరకు 6,76,848 మంది రైతుల నుంచి 41.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు ఢ వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఇప్పటికే రూ.9,789 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయగా, సంక్రాంతి పండుగ నాటికి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా రూ.10,000 కోట్లకు పైగా ధాన్యం కొనుగోలు చెల్లింపులు పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు.తెనాలి మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగంగా, సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్ర చరిత్రలోనే ఒక కొత్త మైలురాయిని సాధించిందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో కష్టపడి పండించిన ధాన్యానికి నెలల తరబడి డబ్బులు రాక రైతులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రైతులకు చెల్లించాల్సిన రూ.1,674 కోట్ల బకాయిలను పెండింగ్‌లో ఉంచిన ఘనత గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.ఈ పరిస్థితులకు పూర్తిగా భిన్నంగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు వ్యవస్థను బలోపేతం చేసిందన్నారు.రైతుకు నచ్చిన మిల్లులోనే ధాన్యం విక్రయించే స్వేచ్ఛవిక్రయించిన 24--48 గంటల్లోనే నగదు నేరుగా రైతు ఖాతాలో జమతేమ శాతం సమస్యలు తొలగించేందుకు రైతు సహాయ కేంద్రాలు, మిల్లుల్లో ఒకే రకమైన యంత్రాల ఏర్పాటువంటి కీలక సంస్కరణలు అమలు చేశామని తెలిపారు.

## బిజెపి ఆధ్వర్యంలో చిన్నారులకు పతంగుల పంపిణీ



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం డివిజన్ లో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని బీజేపీజిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ చేశారు.నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట, అంబేద్కర్ నగర్ కాలనీలలో బీజేపీ నేతలు చిన్నారులకు పతంగులను పంపిణీ చేసి సంక్రాంతిశుభాకాంక్షలు తెలిపారు.సంక్రాంతి పండుగను ప్రజలతో కలిసి ఆనందంగా జరుపుకుంటూ, సంప్రదాయాలను కాపాడుతూ, ప్రజలతో మమేకమై బీజేపీ ముందుకు సాగుతోందని ఈసందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్ కుమార్, మల్కా ప్రకాష్, అనిత పద్మారెడ్డి, అభిషేక్ గౌడ్,ఉదయ్ కిరణ్ రెడ్డి, సాయి గౌడ్, ఆనంద్ గుప్తా, శ్రీమూర్తి నాగరాజు, బాలు, బాలకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగరంగా వైభవంగా ఐనవోలు మల్లన్న బ్రహ్మోత్సవాలు

ఐనవోలు( హనుమకొండ) : తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ఆర్చక బృందం ఆలయంలో తెల్లావారుజాము నుంచే స్వామి వారికి మొలుకోలుపు, నూతన వస్త్రాలంకరణం, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, మహానివేదనలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయా కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కమిటీ సభ్యులు, అర్చకులు, ఈవో కందుల సుధాకర్, ఆలయా సిబ్బంది కాషాయ రంగు పతకాతంతో ఆలయా చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ముందుగా క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామి ఆలయానికి జెండాను కట్టి, అనంతరం దేవాలయల గోపురంకు జెండాలను కట్టి జాతర ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

## పల్నాడు జిల్లాలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు సక్రమంగా పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశం**



పల్నాడు(ప్రశ్న న్యూస్) జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు 22/ ఏ సకాలంలో రిజిస్ట్రేషన్ చేయ్యాలని, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రస్తుతం దస్తావేజుల రిజిస్ట్రేషన్ సేవలు అన్ని డిజిటల్ రూపములో అందుబాటులో ఉన్నందున పల్నాడు జిల్లాలోని అమరావతి మండలంలో ఉన్న నాలుగు గ్రామాలకు రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయములోనికి వెళ్ళినపుడు సిబ్బంది మర్యాద పూర్వక ప్రవర్తన వ్యవహారముల గురించి, దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ సులభతరమ చెయ్యాలని అన్నారు.రిజిస్ట్రేషన్ సేవల్లో అనధికార చెల్లింపులు గురించి రిజిస్ట్రేషన్ కక్షిదారుల నుంచి అభిప్రాయములను (ఫీడ్ బ్యాక్) ప్రభుత్వం సేకరిస్తున్నట్లు, పల్నాడు జిల్లాకు సంభందించిన సదరు ప్రజా అభిప్రాయముల పై పల్నాడు కలెక్టర్ జిల్లా పరిధిలోని అందరూ సబ్ రిజిస్ట్రార్లతో సమీక్షా సమావేశము జరిపి ప్రతి కార్యాలయముల లో అందుబాటులో వున్న సేవలు, చెల్లించవలసిన ప్రభుత్వ రుసుముల గురించి, స్లాట్ బుకింగ్ ల విషయము పై రిజిస్ట్రేషన్ కు వచ్చు ప్రజలలో మరింత అవగాహన పెరుగుట కొరకు నోటీసు బోర్డులు, ప్రజల సౌకర్యార్థము కలుగుటకు హెల్ప్ డెస్కను ఏర్పాటు చేయవలసినదిగాను జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ ఏక మురళి, గుంటూరు జిల్లా డీ.ఐ.జీ జి. శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా రిజిస్టార్ ఏ.వి.ఆర్.కె శ్రీనివాస్, పల్నాడు కు చెందిన ఆయా సబ్ రిజిస్టార్లు, తదితరులు పాల్గొన్నారు

## కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే

పుచ్చుకుంటారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన ఉందని పేర్కొన్నారు. కవిత కాంగ్రెస్ లోకి వస్తారనే ప్రచారం కేవలం రాజకీయ గందరగోళం సృష్టించేందుకేనని అలాంటి ఆలోచన పార్టీకి లేదని ఆయన తేల్చి చెప్పారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి అక్రమాలకు భారత రాష్ట్ర సమితి నేతలే బాధ్యత వహించాలని ప్రజలు వారిని ఏనాడో తిరస్కరించారని గుర్తు చేశారు. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీపై కూడా ఆయన విరుచుకుపడ్డారు. దేవుళ్ల పేరును వాడుకుంటూ బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మతాన్ని రాజకీయాల్లోకి లాగడం సరికాదని హితవు పలికారు.ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత కవిత రాజకీయంగా కొంత సైలెంట్ అయ్యారు. అయితే ఆమె తిరిగి యాక్టివ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పార్టీ మార్పు వార్తలు రావడం గమనార్హం. అంతే కాకుండా ఇటీవల కొత్త పార్టీ కూడా పెట్టబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలని కవిత ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. రాజకీయాల కంటే ముందుగా తనపై ఉన్న విమర్శలను తిప్పికొట్టడమే ఆమె ప్రాధాన్యతగా కనిపిస్తోంది. కేసీఆర్ కుటుంబం నుంచి కవిత లేదా కేటీఆర్ వైఖరి మారితే అది పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే కాంగ్రెస్ నేతలు ఆమె చేరికను ఖండిస్తూనే.. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అవినీతి ఆరోపణలు ఉన్న వారిని చేర్చుకోవడం ద్వారా ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని కాంగ్రెస్ భావిస్తోంది.అందుకే హైకమాండ్, రాష్ట్ర నాయకత్వం ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. కవిత, కాంగ్రెస్ మధ్య ఏదో ఒప్పందం కుదిరిందనే ఆరోపణలను బీజేపీ నేతలు తరచుగా చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే మహేశ్ కుమార్ గౌడ్ స్పందన ప్రాధాన్యత సంతరించుకుంది. తాము ఎవరితోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన చెప్పకనే చెప్పారు. ప్రస్తుతానికి కవిత కాంగ్రెస్ చేరిక వార్తలకు ముగింపు పడినా రాబోయే రోజుల్లో సమీకరణాలు ఎలా మారుతాయో వేచి చూడాలి.

## జిల్లా ప్రజలకు భోగి-మకర సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు

**- కలెక్టర్ శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



**సత్య సాయి జిల్లా ( ప్రశ్న న్యూస్)** శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలందరికీ భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ తెలిపారు.నూతన సంవత్సర ఆరంభంలో వచ్చే ఈ పంట పండుగలు ప్రతి కుటుంబానికి భోగభాగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని వారు ఆకాంక్షించారు. భోగి పండుగను సంప్రదాయబద్ధంగా, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా జరుపుకుంటూ, అందమైన రంగవల్లికలు, రుచికరమైన పిండివంటలు, ఆటపాటలతో బంధుమిత్రుల మధ్య ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవాలని కోరారు. సమైక్య భావంతో, పరస్పర సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

### ప్రతి కుటుంబం భోగి భాగ్యాలతో వెలుగొందాలి

భోగి మంటల వెచ్చటి వెలుగులు ప్రతి ఇంటికి ఆరోగ్యం, శ్రేయస్సు అందించాలని, మకర సంక్రాంతి కాంతులతో ప్రతి గృహం సంక్షేమం, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, కనుమ పండుగతో పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయం, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని జిల్లా మంత్రులు సవితమ్మ, సత్యకుమార్ యాదవ్ జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి కుటుంబానికి చేరి, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## వ్యవసాయ సేవలు రైతుల ప్రగతికి దోహదపడాలి

**- సామూహిక ఎలుకల నివారణతో దిగుబడులు పెంచాలి**
**- జిల్లా కలెక్టర్ రాజకుమారి**



**నంద్యాల (ప్రశ్న న్యూస్ )**వ్యవసాయ శాఖ అధికారులు రైతుల సేవలో నిబద్ధతతో పనిచేసి వారిని ప్రగతి పథంలో ముందుకు నడిపించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. కలెక్టర్ ఛాంబర్ లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సేవలో వ్యవసాయ అధికారులు నిబద్ధతతో పని చేయాలన్నారు. డైరీలో పొందుపరిచిన క్వాలిటీ కంట్రోల్ నిబంధనల ప్రకారం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎలుకల నివారణకు సంబంధించిన పాంప్లెట్లు, పోస్టర్లను విడుదల చేశారు. పంట విత్తనం నుంచి కోత వరకు ఎలుకల వల్ల నష్టం జరుగుతున్నందున రైతులు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొని మెరుగైన దిగుబడులు, అధిక లాభాలు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారులు మరియు ఏపీ వ్యవసాయ అధికారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 9 జిల్లాల్లో రైస్ మిల్లులపై దాడులు

## - భారీ అక్రమాలు వెలుగులోకి

- రూ.60 కోట్లకు పైగా విలువైన ధాన్యం దారి మళ్లింపు
- అక్రమాలకు పాల్పడిన 14 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు
- ఒక మిల్లు మూసివేత, పలు మిల్లుల లైసెన్సులు రద్దుకు సిఫార్సు
- నిఘా ఆధారంగా దాడులు చేశామన్న విజిలెన్స్ డీజీ శిఖా గోయల్









హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీ&ఈ) అధికారులు కొరడా ఝుళిపించారు. 9 జిల్లాల్లోని 19 రైస్ మిల్లులపై ఏకకాలంలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో రూ.60 కోట్లకు పైగా విలువైన ధాన్యం దారి మళ్లినట్లు గుర్తించారు. ఈ అక్రమాలకు సంబంధించి 14 మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, ఒక మిల్లును మూసివేశారు. ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు (కస్టమ్ మిల్లింగ్ రైస్ - సీఎంఆర్) రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. ఈ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తుంది. అయితే, జనవరి 12న మహబూబాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సూర్యాపేట, నల్గొండ, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మిల్లులపై దాడులు జరిగాయి. ఈ తనిఖీల్లో 14 మిల్లుల్లో అక్రమాలు జరిగినట్లు తేలింది. మొత్తం 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం, 1.72 లక్షల బస్తాలు మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. ప్రధానంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రూ.19.73 కోట్లు, సూర్యాపేటలో రూ.19.32 కోట్లు, నారాయణపేటలో రూ.15.91 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నష్టాన్ని రాబట్టాలని, వారి లైసెన్సులను రద్దు చేసి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని పౌరసరఫరాల శాఖకు సిఫార్సు చేశారు. తీవ్రమైన ఉల్లంఘనల కారణంగా పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలం, పూసాల గ్రామంలోని జానకీరామ ఇండస్ట్రీస్‌ను మూసివేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని ఏమాత్రం సహించబోమని విజిలెన్స్ డీజీ శిఖా గోయల్ స్పష్టం చేశారు. "నిఘా వర్గాల సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించి భారీ మోసాన్ని బయటపెట్టాం. మరో ఐదు మిల్లులకు రికార్డుల నిర్వహణలో లోపాలపై నోటీసులు జారీ చేశాం" అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అయితే, ఇలాంటి అక్రమాలు ప్రభుత్వ లక్ష్యాలకు గండికొడుతున్నాయి. భవిష్యత్తులోనూ తనిఖీలు కొనసాగుతాయని, ఎవరైనా అక్రమాలను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

# సంబరాల సంక్రాంతి వచ్చింది. సిరులెన్నో తెచ్చింది



తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలతో ముడిపడి సిరిసంపదల వెల్లివిరియంగా అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే ముఖ్యంగా ముఖ్యమైన పండుగ సంక్రాంతి. ముఖ్యంగా సంక్రాంతి సంబరాల్లో హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దులు, ఎడ్లపందేల సందడి ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పంటలు చేతికొచ్చిన తర్వాత రైతులు సంతోషంగా జరుపుకొనే అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఏడాది కాలంలో ఆరు నెలలు ఉత్తరాయణం అని, ఆరు నెలలు దక్షిణాయణమని అందరికీ తెలిసిందే. ఇంతటి ప్రాముఖ్యత గల సంక్రాంతి పండుగ విశేషాలను తెలుసుకుందామా

### విశిష్టత

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి. పుడమి తల్లి పసిడి పంటలు అందించగా, ప్రకృతి సింగారించుకుని పర్వదినానికి స్వాగతం పలుకగా పట్టు పరికిణీలతో ఆడపడుచులు సందడి చేయగా ముచ్చటగా మూడు రోజుల పండుగ సంక్రాంతి. మొదటిరోజు లోగిళ్లలో ముగ్గులు, భోగ భాగ్యాలతో భోగి పండగ, రెండవ రోజు సకల సంపదలతో సంక్రాంతి మూడవ రోజు కలిసి మెలిసి ఉండాలని దీవించే కనుమ పండగతో అబశ్రీశ్రీఅష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు సిద్ధించాలని ఆకాంక్షిస్తూ కనువిందుగా జరుపుకునే పండుగ. లోగిళ్లలో నిండైన కాంతి, గొబ్బెమ్మలు, నవధాన్యాలు, పతంగుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువులు కోడిపందేలతో పల్లె వాకిట ఆనందాన్ని నింపే పర్వదినమే సంక్రాంతి.

### భోగి పండుగ

మూడురోజుల పండగలో మొదటిరోజు రోజు భోగి పండగను జరుపుకొంటారు. ఈ రోజు సూర్యుడు ధనురాశిలో నుండి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ రోజు నుండి స్వర్గలోకపు వాకిళ్లు తెరుచుకుంటాయని ప్రగాఢ విశ్వాసం. భోగి పండగ సందర్భంగా పాత వస్తువులన్నింటితో భోగి మంటలు వేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అలాగే ఈ రోజు మహిళలు సంక్రాంతి నోములు ఆచరించి నువ్వులు, బెల్లం, గుమ్మడి కాయలు, కూరగాయలు దానం చేస్తారు. చిన్నపిల్లలకు భోగిపళ్లు పోసి ఆశీర్వదిస్తారు. ఇలా చేయడంతో విష్ణుమూర్తి స్వయంగా పిల్లలను దీవిస్తాడని నమ్మకం.

### మకర సంక్రాంతి

నక్షత్రాలన్నింటినీ కలిపి 108 పాదాలుగా, ఈ 108 పాదాలను 12 రాశులుగా విభజించారు. ఈ నెలలో సూర్యుడు ధనురాశి నుంచి మకర రాశిలో ప్రవేశిస్తాడు. అందుకే ఈ పండుగను మకర సంక్రాంతి అంటారు. తెలంగాణ ప్రాంతంలో నువ్వులు, బెల్లం లడ్డూలు, నువ్వుల రొట్టెలు, సకినాలు వంటి పిండివంటలు చేస్తారు. మకర సంక్రమణం రోజు నువ్వుల నూనెలో మహాలక్ష్మి కొలువై ఉంటుందని ప్రతీతి. తలకు నూనె రాసుకుని శనగపిండితో స్నానం చేస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని ప్రగాఢ విశ్వాసం.

### కనుమ పండుగ

మూడు రోజుల పాటు జరుపుకొనే సంక్రాంతి పండుగలో కనుము పండగకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీనిని పశువుల పండగగా జరుపుకోవడం ఆనవాయితీ. కనుమ అంటే పశువు అని అర్థం. ఏడాదిపాటు పొలం పనుల్లో తమకు చేదోడు వాదోడుగా ఉన్న పశువులను పూజించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. కనుమ పండుగ రోజు పశువులు, కొట్టాలను అలంకరించి పశువులను భక్తిశ్రద్ధలతో పూజించి పొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే నేవైద్యాన్ని పొలంలో చల్లి పాడి పంటలు బాగా పండాలని వేడుకుంటారు.

### సూర్యుడు, శనిదేవుని అనుబంధం

సంక్రాంతి పండుగ సూర్యుడు, శని దేవుని అనుబంధానికి ప్రతీక. మకర రాశి అధిపతి అయిన శనీశ్వరుడి ఇంటికి ప్రతి ఏడాది సంక్రాంతి రోజున మాత్రమే సూర్యుడు వెళ్తాడని, అందుకే సంక్రాంతికి సూర్య, శనిల అనుబంధానికి ప్రతీకగా చెప్పుకుంటారు. పురాణాల ప్రకారం భగీరథుడు తపస్సు చేసి గంగను భూమిపైకి రప్పించినది కూడా ఈరోజే కావడం విశేషం.

### ముగ్గుల సంస్కృతి

ముగ్గుల సంస్కృతి ఈ నాటిది కాదని, ఈ సంప్రదాయం వేలాది ఏళ్ల నాటి మొహంజొదారో, హరప్పా నాగరికతల నుంచి మొదలైందని చరిత్ర వల్ల తెలుస్తుంది. అదే సంస్కృతిని నేడు దేశమంతటా, వివిధ రాష్ట్రాలలో జరుపుకొనే భోగి, సంక్రాంతి, కనుమల రోజు ఆడపడుచులు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి మధ్యలో గొబ్బెమ్మలు ఉంచుతారు. ముగ్గును(లక్ష్మీదేవికి చిహ్నంగా భావిస్తారు. గొబ్బెమ్మలను పూజిస్తే శుభాలు కలుగుతాయన్నది నమ్మకం.

### గంగిరెద్దుల సందళ్ళు

హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాల దృశ్యాలు నేడు పూర్తిగా కనుమరుగయ్యాయనే చెప్పాలి. అప్పుడప్పుడు అడపాదడపా కనిపించే దృశ్యాలను తిలకించడానికి పిల్లలు ఆరాటపడడం కనిపిస్తుంది.



సంక్రాంతి పండగ శుభాకాంక్షలతో
రవికుమార్ సంతోజు

# నిజామాబాద్ జిల్లాలో అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం

**ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం**

**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం అని జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పోలీస్ కమీషనర్ సాయి చైతన్య, పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రసంగించారు. 2020 - 21 సంవత్సరంలో కోవిడ్ వల్ల మరణించిన వారి కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ లో మాస్కులు ధరించి సురక్షితంగా ఉన్నారని కానీ వాహనాలు నడిపే సమయంలో సీటు బెల్టు , హెల్మెట్లు పెట్టుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించి అనేకమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. రెండేళ్ల కరోనా సమయంలో 200 మంది కరోనాతో చనిపోతే , 2025 వ సంవత్సరంలో 250 మంది రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్నారు. కుటుంబ భద్రతకు భరోసాను కల్పిస్తూ సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. గత సంవత్సరం ఫిన్లాండ్ అనే దేశంలో ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రమాదాల నియంత్రణకు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ అరైవ్ అలైవ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారని దీన్ని ఒక తపస్సు లాగా ముందుకు తీసుకెళ్లాలని అయన సూచించారు. డ్రైవింగ్ లో మూడు సూత్రాలను తప్పకుండా పాటించాలని పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ముఖ్యంగా యువత అతివేగంతో వెళ్లకుండా నెమ్మదిగా వెళ్లాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు తెలియజేసారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత హుషాముద్దిన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో కుటుంబంలో ఒకరిని కోల్పోయామని, విష్ణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించి సెల్ ఫోన్ వాడకుండా క్షేమంగా వాహనాలు నడపుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. తదుపరి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి , టీ షేర్ట్స్, ట్రాఫిక్ నిబంధనలతో కూడినటువంటి స్లోగానికి సంబంధించినటువంటి ప్లే కార్డ్స్ ప్రారంభించారు. విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో వాహనదారులకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాదు అదనపు డీసీపీ (అడ్మిన్) బి. బస్వారెడ్డి , జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి ఉమామహేశ్వర్, ఆర్టీసీ డిపో మేనేజర్ బి ఎస్ ఆనంద్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ. విశాల్ , న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్, నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి , ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ , డిగ్గి వర్కర్స్ , అంబులెన్స్ అసోసియేషన్ , ఆటో అసోసియేషన్స్ , క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్స్, వ్యాపార సముదాయాల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

## జమ్ము-కాశ్మీర్ లో అనుమానాస్పద బెలూన్..

# సరిహద్దులో కలకలం

జమ్ము-కాశ్మీర్లో పాకిస్తాన్ నుంచి వచ్చిన అనుమానాస్పద బెలూన్ కలకలం రేపింది. ఎరుపు రంగులో, హార్ట్ షేపులో ఉన్న బెలూన్ కథువా జిల్లా పరిధి, పహర్ పూర్ ప్రాంతంలో భద్రతా బలగాలు సోమవారం స్వాధీనం చేసుకున్నాయి. పహర్ పూర్ ప్రాంతం భారత సరిహద్దులో ఉంటుంది. ఈ బెలూన్ పాకిస్తాన్ నుంచి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో భద్రత గురించి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు అర్నియా ప్రాంతంలో కూడా ఇలాంటి ఒక బెలూన్ ను ఇటీవల అధికారుల స్వాధీనం చేసుకున్నారు. ఈ బెలూన్ కనిపించిన నేపథ్యంలో పోలీసులు అక్కడ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ బెలూన్ ఎక్కడి నుంచి వచ్చింది.. ఎందుకు వచ్చింది అనే విషయాల్ని భద్రతా దళాలు విశ్లేషిస్తున్నాయి. ఆదివారం పాక్-భారత్ సరిహద్దు అయిన ఎల్వోసీలో, నౌషేరా-రాజౌరి సెక్టార్ వద్ద కొన్ని డ్రోన్లు అనుమానాస్పదంగా ఎగురుతూ కనిపించాయి. వాటిని గుర్తించిన భారత సైన్యం కౌంటర్ ఎటాక్ ప్రారంభించింది. దీంతో ఆ డ్రోన్లు తిరిగి వెళ్లిపోయాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ భద్రతను మరింత పెంచారు. భద్రతా సిబ్బంది వేగంగా స్పందించడం వల్ల ఎలాంటి డ్రోన్ ఇటువైపు రాలేదని స్థానికులు అంటున్నారు. మరోవైపు తాజాగా వస్తున్న బెలూన్ల ద్వారా ఏమైనా ఆయుధాలు, డ్రగ్స్ వంటివి పాక్ నుంచి ఇండియాకు పంపిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఈ అంశంపై అక్కడ భద్రతా విభాగం గట్టి నిఘా పెట్టింది. ఉన్నతాధికారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

## ఏకేబీఆర్ భూ నిర్వాసిత రైతులను ఆదుకుంటాం

**- ఎమ్మెల్యే బాలునాయక్**

దేవరకొండ : అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పైప్ లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. మంగళవారం లిఫ్ట్ ఇరిగేషన్‌లో భూములు కోల్పోయిన పెద్ద అడిశర్లపల్లికి చెందిన 41 మంది రైతులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సుమారు రూ.53 లక్షల విలుగ గల చెక్కులను అందజేసి మాట్లాడారు. ఏకేబీఆర్ లిఫ్ట్‌తో 6,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, ఇరిగేషన్ డీఈ నాగయ్య, ఏఈ శిల్ప, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, హరి, కిషన్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి

గంగాధర : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతోందని, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గంగాధర మండలం బూరుగుపల్లిలో చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సారథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో మేజర్ గ్రామపంచాయతీ అయిన చొప్పదండిని మున్సిపాలిటీ చేసినట్లు గుర్తుచేశారు. చొప్పదండి మున్సిపాలిటీకి నిర్వహించిన మొదటి ఎన్నికల్లో 90% సీట్లని సాధించామని పేర్కొన్నారు. ఈసారి అదే ఉత్సాహంతో గెలుపు గుర్రాలను బరిలో దించామని, 100 శాతం బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి జైత్రయాత్ర మొదలుపెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చొప్పదండి మున్సిపాలిటీని 140 కోట్లతోని అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. కాంగ్రెస్ దొంగ హామీలను ప్రజల మధ్యలో ఎండగట్టాలని సూచించారు. ఈ నెల 19వ తేదీన కరీంనగర్ జిల్లాలో కేటీఆర్ సమక్షంలో నిర్వహించనున్న సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను అభినందించనున్నారు. మున్సిపల్ ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నారు. కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికుడి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్)రెండు నెలల క్రితం పరిశ్రమలో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించారు.

బొల్లారం డివిజన్ పరిధిలోని రాణే డై కాస్టింగ్ పరిశ్రమలో రెండు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో కృష్ణ సింగ్ అనే కార్మికుడు మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే కార్మికుడు మృతి చెందాడని నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. ఇందుకు అనుగుణంగా పరిశ్రమ యాజమాన్యం 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించేందుకు అంగీకరించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు నష్టపరిహారానికి సంబంధించిన 15 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు. మరో ఐదు లక్షల రూపాయలు అతి త్వరలో అందజేయనున్నట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్మికుల సంక్షేమం ఆర్థిక అభ్యున్నతి లక్షంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజయ్ సింగ్, సునీల్ సింగ్, ప్రిన్స్, టింకు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

### - చల్మెడ లక్ష్మీ నరసింహారావు

**- మర్యాదపూర్వకంగా చల్మెడ ను కలిసిన నీలోజి పల్లి సర్పంచ్ అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అనుముల భాస్కర్ మంగళవారం వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కొనుకటి లచ్చిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, వార్డు సభ్యుడు గూడ బాలకిషన్‌లతో కలిసి ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ, పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయడమే తమ ధ్యేయమని అన్నారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, వారి శ్రమ, అంకితభావంతోనే బీఆర్ఎస్ ప్రజల్లో మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని,ప్రజల అభివృద్ధి కోసం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నీలోజిపల్లి గ్రామ సర్పంచిగా విజయం సాధించిన అనుముల భాస్కర్ కు చల్మెడ అభినందనలు తెలిపారు.

## గుండ్ల పోచంపల్లి లో ముగ్గుల పోటీలు

**గెలుపొందిన వారికి బహుమతులు అందించిన మాజీ కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ లో సంక్రాతి పండగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగిటి మమత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులపోటిల కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గుండ్లపోచంపల్లి మున్సిపల్ లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు, మహిళలు ఎంతో ఇష్టం జరుపుకొనే గొప్ప పండగ ఈ సంక్రాంతి పండుగ అని అన్నారు, మహిళలు పోటాపోటిగ వచ్చి ముగ్గులు వేయడం ఆనందంగా ఉందన్నారు. మహిళలందరూ ఈ ముగ్గుల పోటీలో పాల్గొనడం చాలా సంతోషమని కూడా శ్రీనివాస్ అన్నారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి సాయిపేట శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ముగ్గులపోటీలో మొదటి బహుమతి మౌనిక ద్వితీయ బహుమతి శిరీష తృతీయ బహుమతి భాగ్య లు గెలుపొందారు, ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు, ఈ యొక్క కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ పులిగిల్ల రాజేశ్వర్, ా బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కోమలత, మాజీ ఉపసర్పంచ్ చిల్ల వెంకటేష్, సాయిపేట మల్లేష్,కృష్ణారెడ్డి, కావలి భాస్కర్, గుండ్లపోచంపల్లి 299 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, మలిగే కిషన్, షబ్బీర్,చిల్ల సాయికుమార్,అబ్రర్ ఖాన్, వడ్డే ప్రవీణ్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## మీరాజ్ వింటర్ ఉత్సవ మేళాతో

# హుస్సేన్ సాగర్‌కు ముప్పు,

**గాలిలో దీపంలా ఫైర్ సేఫ్టీ**


**ప్రజల ప్రాణాలకు భద్రత ఏది.?**

**పర్యావరణం పాడుకేనా ఉత్సవ మేళాలు**

**అధికారుల అవినీతితో ఒక్కరికే**

**సంవత్సరాలుగా కేటాయింపు.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ గుండెచప్పుడు అయిన హుస్సేన్ సాగర్ తీరంలో పీపుల్స్ ప్లాజా వేదికగా జరుగుతున్న మీరాజ్ వింటర్ ఉత్సవ మేళా తీవ్ర వివాదాలకు కేంద్రబిందువుగా మారుతుంది. వినోదం పేరుతో ఏర్పాటు చేసిన ఈ మేళాలో జరుగుతున్న అవినీతి, నిర్లక్ష్యం పై ప్రజలు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. అధికారుల బాధ్యతారహిత్యం, మౌనం ప్రజలను ఆశ్చర్యానికి, ఆందోళనకు గురి చేస్తోంది. మేళాలో ఏర్పాటు చేసిన మూత్రశాలల డ్రైనేజీని నేరుగా హుస్సేన్ సాగర్‌లోకి కలుపుతున్న దృశ్యాలు పర్యావరణవేత్తలను, నగర ప్రజలను షాక్‌కు గురిచేస్తున్నాయి. ఇప్పటికే కాలుష్యంతో నలుగుతున్న హుస్సేన్ సాగర్‌పై ఇది మరో దెబ్బగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రం, పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ ప్రకటనలు కాగితాలకే పరిమితమా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి హుస్సేన్ సాగర్ జలాల శుద్ధికరణ కోసం ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఏర్పాటు చేసింది కానీ ఇలాంటి మురికి నీరును డైరెక్ట్ గా హుస్సేన్ సాగర్ లోని కి పంపిస్తే ఎన్ని ట్రీట్మెంట్ ప్లాంట్లు ఎన్ని కోట్లు ఖర్చుపెట్టిన డ్రైనేజీలో కోసినట్లే అంటూ పర్యావరణ పరిరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు లంచాలు తీసుకొని పర్యావరణ పరిరక్షణ ప్రజల రక్షణను గాలికి వదిలేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఫైర్ సేఫ్టీ పై నిర్లక్ష్యం..

ఇంతకంటే ఆందోళనకరమైన విషయం ఏమిటంటే ఫైర్ సేఫ్టీ పూర్తిగా నిర్లక్ష్యం మారిందని లక్షలాది మంది



ప్రతిరోజూ వచ్చే ఈ మేళాలో సరైన ఫైర్ ఎగ్జిట్ మార్గాలు లేకపోవడం ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారని అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే రక్షణ ప్రణాళిక శూన్యంగా మారింది.

ఒక చిన్న ప్రమాదం జరిగినా భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?

అగ్నిప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?
అనుమతులు ఇచ్చిన అధికారులదా.?
నిబంధనలు పాటించని నిర్వాహకులదా?



మేళా నిర్వాహకులు లాభాలపైనే దృష్టి పెట్టి, ప్రజల ప్రాణాలు, పర్యావరణ భద్రతను తాకట్టు పెట్టడం తీవ్ర విమర్శలకు తాగిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఒక్కరికే ఇక్కడ ఉత్సవ మేళాకు స్థలం కేటాయించడం వెనుక భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని అధికారులు లోపాయికారి ఒప్పందాలు చేసుకోవడం వల్లే ఈ తథంగాలంతా జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా హెచ్ఎండిఏ అధికారులు,కాలుష్య నియంత్రణ మండలి,ఫైర్ డిపార్ట్మెంట్అధికారులు కళ్లుమూసుకుని డ్యూటీ చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారులది నిర్లక్ష్యమా.? లేక లోపాయికారీ ఒప్పందమా.? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. హుస్సేన్ సాగర్‌లోకి వెళ్లే డ్రైనేజీని తక్షణమే నిలిపివేయాలి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫైర్ సేఫ్టీపై సమగ్ర తనిఖీలు జరపాలని పూర్తిస్థాయిలో ఫైర్ సేఫ్టీ సామాగ్రిని ఏర్పాటు చేయాలని,నిబంధనలు పాటించని మేళా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిపై కేసులు నమోదు చేయాలని,వినోదం పేరుతో హుస్సేన్ సాగర్ ను విషపూరితం చేయడం, ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం సహించేది కాదన్నారు. ఇప్పటికైన తెలంగాణ ప్రభుత్వం, హెచ్ఎండిఏ అధికారులు స్పందించకపోతే, ఇది రేపు జరిగే పెద్ద ప్రమాదానికి నాంది కావడం ఖాయమని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా భోగి రంగోలి

## సంబరాలు మహిళల ప్రతిభకు ఘన సత్కారం

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) భోగి పండగ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో మహిళల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేలా రంగోలి పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పట్టణంలోని పొన్నాలమ్మ గుడి వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ సంత ప్రాంగణంలో జరిగిన ఈ భోగి పండుగను రంగోలి పోటీలకు నియోజకవర్గం నలుమూలల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రంగుల మేళవింపులతో వేసిన అందమైన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. మన సంప్రదాయాలను కాపాడుతూ పండుగ శోభను రెట్టింపు చేసే లక్ష్యంతో, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా బొజ్జల బృందమ్మ మరియు వారి కుమారుడు శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని బహుమతులను ప్రధానం చేశారు. అంతేకాకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక పురస్కారంగా రైస్ కుక్కర్లు, హాట్ బాక్సులు బహుమతిగా ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను అభినందిస్తూ, ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. భోగి సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా, మహిళల భాగస్వామ్యంతో ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ రంగోలి పోటీలను నిర్వహించామని, మహిళల కళాత్మక ప్రతిభను ప్రోత్సహించడం



తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీకాళహస్తిలో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చి, మహిళలకు ఒక మరపురాని అనుభూతిని అందించింది. అదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు ప్రత్యేక ఆకర్షణీయమైన బహుమతులు అందించినారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సీఎంఆర్ కాలేజ్

**నిబంధనలు ఉల్లంఘిస్తున్న కాలేజీలని**

**వెంటనే సీజ్ చేయండి**

**ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని**

**వ్యాపారాలు**

**ఎమ్మెల్యే మల్లారెడ్డి పై కాంగ్రెస్ నేతల ఫైర్**

మేడ్చల్( ప్రశ్న న్యూస్) చామకూర మల్లారెడ్డి ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని వ్యాపారాలను చేసుకుంటున్నాడని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రెండు ఏండ్లుగా ప్రజల్లో లేని వ్యక్తి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల కోసం జనాల్లోకి వస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం అంటూ ఎమ్మెల్యే మల్లారెడ్డి పై కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేసే నైతిక హక్కు ఎమ్మెల్యే మల్లారెడ్డి కి పేర్కొన్నారు. మేడ్చల్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ ను గుండ్లపోచంపల్లి డివిజన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ కాలేజ్, సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ సీఎంఆర్ హాస్పిటల్ నుండి ఎలాంటి ఎస్. టీ. పి ప్లాంట్ లేకుండా డ్రైనేజ్ మురుగు నీటిని నేరుగా సుతారిగూడ చెరువులో కలుపుతున్నారని, ఇదే విధంగా మైసమ్మగూడలోని మల్లారెడ్డి కి చెందిన ఇంజనీరింగ్ కళాశాలల నుండి మైసమ్మగూడ లోని సుమారు చెరువులోకి దీనివల్ల ఈ రెండు చెరువులు మురికి నీటితో నిండిపోయాయని, ఈ చెరువులో మురికి నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలి అంటూ డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. మురికి కలవడం వల్ల సుమారు చెరువుతోపాటు సుతారిగూడ చెరువు నుండి తీవ్ర దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే డ్రైనేజ్ నీరు నిల్వ ఉండటంతో దోమలు, గుర్రం డెక్క విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అనేక రోగాలతో గ్రామ ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా చెరువు లోని మురికి నీటిని తాగడం వల్ల చేపలు, పక్షులు, జంతువులు కూడా అనారోగ్యానికి గురవుతున్నాయని, ఈ చెరువుల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి కి చెందిన కళాశాలల నుండి మురికి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.




తన సొంత గ్రామము గుండ్ల పోచంపల్లి అని చెప్పుకునే ఎమ్మెల్యే మల్లారెడ్డి గత ఎన్నికల్లో మంచి నీటి బిల్లులను మాఫీ చేపిస్తానని ఓట్లు దండుకొని మొహం చాటేస్తున్నారని ఆరోపించారు. మైసమ్మ గూడా, గుండ్ల పోచంపల్లి లో 25 వేల నుండి లక్ష రూపాయల వరకు పెండింగ్ నల్ల బిల్లులు ఉన్నాయని, సొంత గ్రామమైన గుండ్ల పోచంపల్లిని పట్టించుకోని ఎమ్మెల్యే ఇక నియోజకవర్గ ప్రజలకు ఏం చేస్తానని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత ఎమ్మెల్యే మల్లారెడ్డి కి లేదని ఘాటుగా విమర్శించారు.

ఈ కార్యక్రమం గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు సాయి పేట శ్రీనివాస్ ఓపిసిఎల్ చైర్మన్ రవి ముదిరాజ్, మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్,సాకారబోయిన మల్లేష్ ముదిరాజ్ (వర్కింగ్ ప్రెసిడెంట్), రాజేందర్, చిల్ల వెంకటేశ్, సాయిపేట మల్లేష్, వినోద్, కావలి భాస్కర్, కుండ భాను, మాధవ్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ ముదిరాజ్, శివ ముదిరాజ్, కిషన్, సాయికుమార్, హర్షత్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) అన్ని హంగులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయాల నిర్మాణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. ఆర్మూర్ శివారులోని పిప్రి రోడ్డులో గల స్థలంతో పాటు, అంకాపూర్ శివారులోని స్థలాన్ని స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం, రవాణా సదుపాయం, విద్యార్థులకు ఏ మేరకు భద్రత ఉంటుంది, నేల స్వభావం తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. సమగ్ర సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని అన్నారు. ఇప్పటికే మంజూరీలు తెలుపబడిన ఆయా నియోజకవర్గాలలో వీటి నిర్మాణాలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగం సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## జిల్లా డిసిసి అధ్యక్షుడు గాజెంగి నందయ్యను కలిసిన జగిత్యాల జిల్లా తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకులు



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా కార్యవర్గం, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి) అధ్యక్షుడు గాజెంగి నందయ్యను మర్యాదపూర్వకంగా కలిశారని ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి) అధ్యక్షుడు గాజెంగి నందయ్యను శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) జగిత్యాల జిల్లా ఇంచార్జి, టీ జే ఎస్ ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల సంజయ్ రెడ్డి, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచమల్ల సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దారుకోట శేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్ .రాజేందర్, సంయుక్త కార్యదర్శులు సిగిరి రాజరెడ్డి, గిద్దె తిరుపతి, ముదాం శ్రీనివాస్, అనుమాండ్ల రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జంగా శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులు లింగా వెంకటేశ్వర్ రెడ్డి, కాసిరెడ్డి నాగరాజు, ఏనుగుల లక్ష్మీనారాయణ, రాడే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కలిసిన తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకులు



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా కార్యవర్గం, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారని ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) జగిత్యాల జిల్లా ఇంచార్జి, టీ జే ఎస్ ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల సంజయ్ రెడ్డి, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచమల్ల సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దారుకోట శేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్ .రాజేందర్, సంయుక్త కార్యదర్శులు సిగిరి రాజరెడ్డి, గిద్దె తిరుపతి, ముదాం శ్రీనివాస్, అనుమాండ్ల రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జంగా శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులు లింగా వెంకటేశ్వర్ రెడ్డి, కాసిరెడ్డి నాగరాజు, ఏనుగుల లక్ష్మీనారాయణ, రాడే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నీలోజిపల్లి గ్రామాభివృద్ధిలో మరో అడుగు

**-సర్పంచ్ చొరవతో పాడైన లైట్లకు చెక్ - నూతన వీధి దీపాల ఏర్పాటు**

**- గ్రామాభివృద్ధికి నిరంతర కృషి- సర్పంచ్ : అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామాభివృద్ధికి కంకణబద్ధులైన సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో నీలోజిపల్లి గ్రామంలో మౌళిక వసతుల మెరుగుదల దిశగా కీలక అడుగు పడింది. గ్రామంలో పనిచేయకుండా పాడైన 30 స్ట్రీట్ లైట్లను తొలగించి,వాటి స్థానంలో నూతన వీధి దీపాలను మంగళవారం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాత్రివేళల్లో గ్రామ ప్రజలకు భద్రతతో పాటు మెరుగైన వెలుతురు అందించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. వీధి దీపాల వల్ల రహదారులు, కాలనీలు మరింత ప్రకాశవంతంగా మారి, ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని, అవసరమైన మౌళిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తామని సర్పంచ్ భాస్కర్ భరోసా ఇచ్చారు.

# చిన్న పిల్లల్ని ముద్దు పెట్టుకోవడం కరెక్ట్ కాదంటున్న డాక్టర్ లు




మేడ్చల్( ప్రశ్నన్యూస్) చిన్న పిల్లల బుజ్జి బుగ్గలను చూడగానే ముద్దు పెట్టుకోవాలని ఎవరికైనా అనిపిస్తుంది. అయితే ఆ ఆప్యాయతే పసిబిడ్డల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని మీకు తెలుసా.? పసికందుల రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉండటం వల్ల మనలోని ఇన్ఫెక్షన్లు వారికి త్వరగా సోకుతాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ పీడియాట్రిషియన్ డాక్టర్ గౌతమ్ యలముడి తల్లిదండ్రులకు కొన్ని సూచనలు చేశారు. పసిపిల్లల ఆరోగ్యం విషయంలో ఎందుకు జాగ్రత్తగా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం. తల్లిదండ్రులు, బంధువులు చిన్న పిల్లల్ని చూడగానే ఎంతో మురిసిపోతారు. బయట స్నేహితులు కూడా చిన్నారుల్ని చూడగానే మురిసిపోతుంటారు. ఆ ఆప్యాయతను చాటుకోవడానికి వెంటనే వారిని ఎత్తుకుని బుగ్గలపై, నుదుటిపై ముద్దులు కురిపిస్తుంటారు. అయితే మనం చూపే ఈ ప్రేమ పసిబిడ్డల ప్రాణాల మీదకు తెచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రముఖ పీడియాట్రిషియన్, నియోనాటాలజిస్ట్ డాక్టర్ గౌతమ్ యలముడి ఇటీవల సోషల్ మీడియా వేదికగా ఈ విషయంపై తల్లిదండ్రులకు పలు కీలక సూచనలు చేశారు. ఆ పూర్తి వివరాలేంటో ఇప్పుడు చుద్దాం.

### రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది

చిన్న పిల్లలు పుట్టినప్పుడు వారి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి



చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. బయట ప్రపంచంలోని క్రిములతో పోరాడే సామర్థ్యం వారి శరీరానికి వెంటనే రాదు. మనం ముద్దు పెట్టుకున్నప్పుడు మన నోటిలోని లాలాజలం ద్వారా

ఎన్నో రకాల బ్యాక్టీరియాలు, వైరస్లు పసివారి శరీరంలోకి ప్రవేశిస్తాయి.

పెద్దవారికి సాధారణంగా అనిపించే చిన్న జలుబు లేదా ఇన్ఫెక్షన్ కూడా పసిబిడ్డల విషయంలో అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. పసికందుల అవయవాలు పూర్తిగా వృద్ధి చెందని కారణంగా, చిన్నపాటి జ్వరం వచ్చినా వారి శరీరం తట్టుకోలేదు. ముఖ్యంగా డాక్టర్ గౌతమ్ యలముడి చెప్పిన విధంగా లాలాజలం ద్వారా ప్రధానంగా మూడు రకాల వైరస్లు పిల్లలకు సోకే ప్రమాదం ఉంది.

### వైరస్తో ముప్పు ఉంది, హెర్పెస్ సింప్లెక్స్ వైరస్

దీనిని 'కిస్ ఆఫ్ డెత్' అని కూడా పిలుస్తారు. ఇది పెద్దవారిలో కేవలం పెదవుల దగ్గర పుండ్లలా కనిపిస్తుంది కానీ, పసిపిల్లలకు సోకితే అది మెదడు వాపు వ్యాధికి దారితీసి ప్రాణాంతకంగా మారుతుంది.

ఆర్.ఎస్.వి: ఇది శ్వాసకోస సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. పిల్లల్లో ఊపిరి తీసుకోవడం కష్టతరం చేసి ఆసుపత్రి పాలయ్యేలా చేస్తుంది. ఊపిరితిత్తులపై ఈ వైరస్ తీవ్ర ప్రభావం చూపుతుంది.

**ఫ్లూ:**

సాధారణ జలుబు, దగ్గు వంటివి కూడా పసివారిలో తీవ్రమైన జ్వరాన్ని, నీరసాన్ని కలిగిస్తాయి.

డాక్టర్ ఏమన్నారంటే

### మొహమాటం వద్దు.. ముద్దు - వద్దు

ఎవరైనా మీ పిల్లల్ని ముద్దు పెట్టుకుంటుంటే మొహమాటపడకుండా వద్దు అని చెప్పాలి" అని డాక్టర్ గౌతమ్ సూచిస్తున్నారు. బంధువులు ఏమనుకుంటారో అనే సంకోచంతో పిల్లల ఆరోగ్యాన్ని పణంగా పెట్టవద్దు. కనీసం ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు పిల్లలను ఎవరూ ముద్దు పెట్టుకోకుండా చూడటం ఉత్తమమైన పద్ధతి.

ఒకవేళ బిడ్డకు ఏడాది దాటినప్పటికీ, మీకు ఏవైనా ఇన్ఫెక్షన్లు ఉంటే మాత్రం ముద్దు పెట్టుకోకపోవడమే మంచిది. మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు పిల్లలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.

### ప్రేమను ఎలా చూపించాలి.?

పిల్లలపై ప్రేమను చూపించడానికి ముద్దు ఒక్కటే మార్గం కాదు. ముద్దుకు బదులుగా వారిని ప్రేమగా ఎత్తుకోవడం, హగ్ చేసుకోవడం వంటివి చేయవచ్చు. మీ ఇంటికి వచ్చే అతిథులకు, ఇతర బంధువులకు కూడా ఇదే విషయాన్ని సున్నితంగా అర్థమయ్యేలా వివరించండి.

పిల్లల చర్మం చాలా సున్నితంగా ఉంటుందని, ఇన్ఫెక్షన్లు త్వరగా సోకుతాయని వారికి చెప్పి కేవలం హగ్ చేసుకోమని కోరండి. ముఖ్యంగా బయట నుండి వచ్చిన వారు చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాతే పిల్లలను తాకాలని గుర్తు చేయండి.

మీ బిడ్డ క్షేమమే అందరికంటే ముఖ్యం. కాబట్టి పసిపిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ద్వారానే వారిని మనం సురక్షితంగా ఉంచగలమని డాక్టర్లు చెబుతున్నారు. పసిప్రాయంలో మనం తీసుకునే చిన్నపాటి జాగ్రత్తలే వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి.

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండ

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**

**- బోయినిపల్లి మండలంలో మృత కుటుంబాలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శ - ఆర్థిక సహాయం**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించి, తన సానుభూతిని వ్యక్తం చేస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన యూరప్‌లో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మేకల ప్రవీణ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలాగే బొడ్డు పరశురాములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబానికి సాంత్వన తెలిపారు. అనంతరం రత్నంపేట గ్రామ పంచాయతీ సిబ్బంది ఎదురుగట్ల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు. అలాగే దేశాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మాడిశెట్టి జనార్దన్ తండ్రి మృతికి సంబంధించిన కుటుంబాన్ని కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కష్ట సమయంలో వారి వెంట నిలవడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకోవడమే తన రాజకీయ జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ఆయా బాధిత కుటుంబ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# సంప్రదాయాల పరిరక్షణకు ముగ్గుల పోటీలు






గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా, గంగాధర మండలంలోని కొండయ్యపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ వినయ్ సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో పోటీలను ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న హాజరై, ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తూడి లచ్చన్న మాట్లాడుతూ, "గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను ఇలాంటి ముగ్గుల పోటీలతో ఘనంగా జరుపుకోవడం అభినందనీయం. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం సంతోషకరం. ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంచి, సాంస్కృతిక విలువలను కాపాడుతాయి. మహిళల ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది" అని తెలిపారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు, అభిమానులు తూడి లచ్చన్నను గజమాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, ఈ ముగ్గుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# మంత్రి పర్యటనలో 'ప్రోటోకాల్ల రగడ

వెలవెలబోయిన అంబేద్కర్ భవన శంకుస్థాపన!

హంగామా కోసమే శంకుస్థాపనలా?

హడావుడిగా మంత్రి కార్యక్రమాలు

అంబేద్కర్ భవన శంకుస్థాపనకు

మాల సంఘాలకు

ముందస్తు సమాచారం లేదు

అందుకే అధిక సంఖ్యలో పాల్గొనలేదు

అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు

నక్క రవి ఆగ్రహం

మంథని(,ప్రశ్న న్యూస్) : మంథని నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటనలో భాగంగా నిర్వహించిన అంబేద్కర్ భవన శంకుస్థాపన కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. రూ. కోటి వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ భవన శంకుస్థాపన కార్యక్రమానికి దళిత సంఘాల నాయకులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో సభాప్రాంగణం వెలవెలబోయింది. ఈ పరిణామంపై అంబేద్కర్ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు నక్క రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**-ముఖ్య అంశాలు:**

- సమాచార లోపం: కోటి రూపాయల భారీ బడ్జెట్‌తో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినప్పటికీ, స్థానిక దళిత సంఘాలకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- బోసిపోయిన ప్రాంగణం: సమాచారం లేకపోవడంతో దళితులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కాలేదు. దీనివల్ల మంత్రి సమక్షంలోనే సభ వెలవెలబోయి నిరాశను మిగిల్చింది.
- మంత్రి చుట్టూ ఉన్నవారిపై విమర్శలు: మంత్రి శ్రీధర్ బాబు మంచి వారే అయినప్పటికీ, ఆయన చుట్టూ ఉన్న కొందరు కాంగ్రెస్ దళిత నాయకులు ఇతర సంఘాలను కావాలనే దూరం పెడుతున్నారని నక్క రవి ఆరోపించారు.

**- నక్క రవి ఆవేదన -- మంత్రికి విన్నపం**

- ఈ సందర్భంగా నక్క రవి మాట్లాడుతూ, మంథనిలో అంబేద్కర్ భవన శంకుస్థాపన కేవలం హడావుడిగా, హంగామా కోసమే చేసినట్లు కనిపిస్తోందని విమర్శించారు.
- "దళిత సంఘాలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. కానీ కొంతమంది కాంగ్రెస్ నాయకులు మమ్మల్ని మంత్రికి



కలవకుండా అడ్డుకుంటున్నారు. దళితులకు సంబంధించిన కీలక కార్యక్రమాల్లో అసలైన దళిత నాయకులను చులకన చేస్తూ, మంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇకనైనా మంత్రి గారు ఈ విషయాన్ని గమనించి, భవిష్యత్తులో దళిత సంఘాల నాయకులకు ముందస్తు సమాచారం అందేలా చూడాలి."

**- నక్క రవి, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు.**

- హడావుడి నిర్ణయాల వల్ల దళిత సామాజిక వర్గాల్లో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని, సమన్వయ లోపాన్ని సరిదిద్దుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

## మల్కె శ్రీధర్ జ్ఞాపకార్థంతో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన

### గ్రామ సర్పంచ్ స్వప్న ఉశయ్య



మెదక్ ప్రతినిధి(ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం నాడు మల్కె శ్రీధర్ జ్ఞాపకార్థంతో కిష్టాపూర్ యువజన నాయకులు క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు ఈ క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులుగా కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య పాల్గొని శ్రీధర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న నాలుగు టీముల జట్టులను శుభాకాంక్షలు తెలిపి టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ క్రీడలో గెలుపు ఓటమిలో సహజం అందరు కలిసి స్నేహభావంతో కలిసిమెలిసి ఆడుకోవాలని యువకులకు విజ్ఞప్తి చేశారు గెలుపొందిన టీమ్ కు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అత్యుత్తమ సేవలతో జిల్లా అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలవాలి

### కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారిచే టేబుల్ క్యాలెండర్ మరియు వాల్ క్యాలెండర్ , ఆవిష్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తో ఆవిష్కరించడం జరిగినది . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధికారులకు వారి కుటుంబ సభ్యులకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారుజిల్లా అభివృద్ధిలో అధికారుల భాగస్వామ్యం చాలా అవసరమని ఉత్తమ సేవలతో మెదక్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విట్టల్ ప్రెసిడెంట్ నాగభూషణం సెక్రటరీ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ ట్రెజరర్ ఎల్లయ్య అసోసియేట్ ప్రెసిడెంట్ వేణు వైస్ ప్రెసిడెంట్ మహేష్ సౌజన్య మధులత గంగాధర్ యాదగిరి నాగరాజు జెంట్ సెక్రెటరీ బాల నరసయ్య శిరీష స్వరూ రాథోడ్ సాయిలు సుదర్శన్ ఆర్గనైజర్ సెక్రెటరీ యాదగిరి రాజశేఖర్ రామచంద్ర రాజు బాల రెడ్డి సుధాకర్ నరేందర్ మహేష్ మహేష్ కిష్టయ్య లింగేశ్వర్ హరి ప్రసాద్ వారితోపాటు వివిధ శాఖలకు చెందిన హెచ్వోడీస్ దేవకుమార్ శ్రీనివాసరావు జగదీశ్వర్ అనిల్ కుమార్ మరియు వివిధ శాఖలకు చెందిన హెచ్ డి అందరూ పాల్గొని ఈ క్యాలెండర్ విజయవంతంగా ఆవిష్కరించారు.

## గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

### కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్త పాటించాలి

### మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రజలంతా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ఐపీఎస్ సూచించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ అంటే గాలిపటాల సంబరమని, అయితే ఆనందంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, బిల్డింగ్‌లపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.?

ముఖ్యంగా భవనాల పైకప్పులపై గాలిపటాలు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలను పెద్దల పర్యవేక్షణలోనే గాలిపటాలు ఎగురవేయాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా (నైలాన్ దారం) విక్రయం, వినియోగం ప్రాణాంతకంగా మారుతుందని పేర్కొన్నారు. చైనా మాంజా వల్ల మనుషులకు, పక్షులకు తీవ్ర గాయాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో జిల్లాలో చైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెట్ల కొమ్మలు లేదా కరెంట్ స్తంభాలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించడం ప్రమాదకరమని, అలాంటి సందర్భాల్లో విద్యుత్ శాఖ లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

## భారతీయ సంస్కృతి కి ప్రతీకగా ముగ్గులు


- ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవలు హర్షణీయం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్
- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "ముగ్గుల పోటీలు"
- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి సౌజన్యంతో..బహుమతులు ప్రధానం



వేములవాడ (ప్రశ్న న్యూస్) సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళల కళాత్మక ప్రతిభకు వేదికగా మంగళవారం వేములవాడ పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ సౌజన్యంతో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్, రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ముగ్గుల పోటీలకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముగ్గులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళల కోసం ఇలాంటి ముగ్గుల పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. పండగ విశిష్టతను ప్రతిబింబించే విధంగా మహిళలు వేసిన ముగ్గులు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే కరోనా కష్టకాలం నుంచి నేటి వరకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ అలుపెరగకుండా అన్నదాన సేవలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల పక్షాన నిలబడటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మకతతో రంగురంగుల ముగ్గులు వేసి పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు.

## మహిళా ప్రతిభకు వేదికగా ముగ్గుల పోటీలు

- మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి
- బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ : పెంచాల సౌమ్య - మహేష్
- బూరుగుపల్లి లో ఘనంగా "ముగ్గుల పోటీలు"
- విజేతలకు,పాల్గొన్నవారికి బహుమతులు ప్రధానం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామంలోని మున్నూరు కావు సంక్షేమ సంఘం ఫంక్షన్ హాల్లో మంగళవారం గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య -- మహేష్, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆడపడుచులకు, మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన మహిళలు,ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీలలో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులతో పాటు, పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్ మాట్లాడుతూ, "సంక్రాంతి వంటి పండుగలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ కుటుంబాల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయి. ముఖ్యంగా మహిళల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి ముగ్గుల పోటీలు మంచి వేదికగా నిలుస్తున్నాయి. బూరుగుపల్లి గ్రామంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే మా పాలకవర్గం లక్ష్యం. గ్రామ అభివృద్ధితో పాటు మహిళా సాధికారతకూ పెద్దపీట వేస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళ అభినందనీయం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అతికం రాజశేఖర్ గౌడ్, మ్యాన వర్షిత -- వెంకటేష్, పెరుక గౌతమి -- మహేష్, కల్లెపల్లి మమత -- శంకర్, కొలుపుల మల్లేశం, అక్కరాజు తిరుపతి తదితరులతో పాటు గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంక్రాంతి పండగ పూట మందుబాబులకు షాక్

### ధరలు భారీగా పెంచిన ఏపీ సర్కార్



అమరావతి (ప్రశ్న న్యూస్) సంక్రాంతి పండుగ వేళ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం ప్రియులకు షాక్ ఇచ్చింది. రూ.99 ఎంఆర్పి మినహా అన్ని రకాల మద్యం ధరలను రూ.10 పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.1,391 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని అంచనా. అయితే, బార్లపై అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రద్దు చేయడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.340 కోట్ల ఆదాయం తగ్గే అవకాశం ఉంది. సంక్రాంతి పండుగ వేళ మందుబాబులకు ప్రభుత్వం షాకిచ్చింది. మద్యం ధరలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పెంపు అన్ని రకాల బ్రాండ్లపై వర్తించదని తెలిపింది. ప్రస్తుతం ఉన్న ధరను ఒకేసారి రూ.10 పెంచింది. ప్రభుత్వ నిర్ణయం పట్ల మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పెంపు ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న బోయిని రాజు

- మృతుని కుటుంబానికి పరామర్శ
- ప్రగాఢ సంతాపం - ఆర్థికసాయం అందజేత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన పాముల ప్రవీణ్ (33) ఇటీవల యూరప్‌లోని ఆర్మేనియా దేశంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం అదే గ్రామానికి చెందిన బోయిని రాజు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5 వేల నగదు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ప్రవీణ్ కుటుంబానికి తమ వంతు సహాయం చేయడం బాధ్యతగా భావిస్తున్నానని బోయిని రాజు తెలిపారు. ఆయన చూపిన మానవీయతను గ్రామస్తులు అభినందించారు.

## విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో గ్రామాలభివృద్ధి వేగవంతం

- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు : న్యాత నవీన్
- గెలిచిన సర్పంచులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం - అభినందనలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్ ఘనంగా సన్మానించారు. లింగంపల్లి, మల్లారం, జయరాం, వట్టెంల, ఫాజుల్‌నగర్, నమిలిగుండుపల్లి, అచన్నపల్లె,వెంకటంపల్లి, బాలరాజుపల్లి, నాగయపల్లి గ్రామాల్లో పర్యటించి పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు శాలువాలు, పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంలోని గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాభివృద్ధికి యూత్ కాంగ్రెస్ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

# తెలుగు రాష్ట్రాలలో జోరుగా
# సంక్రాంతి సంబరాలు

**u గ్రామాల బాట పట్టిన ప్రజలు u కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ**
**u సంక్రాంతి వస్తే పట్టణాలు కాళీ.. పల్లెలు ఫుల్**






హైదరాబాద్ **(ప్రశ్న న్యూస్)** తల్లి పసిడి పంటలు అందించంగా.. ప్రకృతమ్మ సింగారించుకుని పండుగ పర్వదినానికి స్వాగతం పలుకంగా... పట్టు పరికిణీలతో ఆడపిల్లలు సందడి చేయంగా.. ముత్యాల ముగ్గులతో ఇంటి లోగిళ్లు నిండంగా.. భోగభాగ్యాలతో భోగి పండుగ జరుపుకోగా.. ముచ్చటగా మూడురోజు ల పండుగ

### ఇప్పుడు మనం తెలుసుకుందాం..

ప్రతి ఇంటి ముంగిట్లో రంగు రంగుల రంగవల్లికలు.. భోగి మంటలు, కొత్త బట్టలు, పిండి వంటలు, గాలిపటాలు ఎగరేస్తూ సందడి చేసే పిల్లలు, బొమ్మల కొలువులు, హరిదాసుల కీర్తనలు, బొమ్మల కొలువులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడిపందేలు.. ఇలా సంక్రాంతి అంటేనే ఓ సంబరం.. ఓ ఎమోషన్. అంగరంగ వైభవంగా చేసుకునే సంక్రాంతి పండుగ

### విశిష్టత తెలుసుకుందాం..

కాలచక్రానికి అధిపతి సూర్యుడు సూర్యుడి అధీనంలో నిరంతరం తిరిగే కాలచక్రంలో ఏడాదికి రెండు ఆయనాలు వస్తాయి. అవి ఒకటి దక్షిణాయనం కాగా, రెండోది ఉత్తరాయణం. ప్రతియేటా జనవరి నెల సంక్రాంతి పండుగ దీన్నే ఉత్తరాయణం పుణ్యకాలంగా పిలుస్తాం. ఈ సమయంలోనే పంటలూ చేతికొస్తాయి. అందుకే సంక్రాంతి పండుగకి ఒక వైపు సూర్యారాధన చేస్తూనే మరోవైపు ఆహారం ఇచ్చే నేలతల్లినీ అందమైన రంగవల్లికలతో, పుష్పాలతో పూజిస్తాం. ఈ సంక్రాంతి పండుగ భోగి పండుగతో మొదలై కనుమ పండుగతో ముగుస్తుంది.

### సంక్రాంతి తేదీలు

జనవరి 14 బుధవారం : భోగి పండుగ
జనవరి 15 గురువారం : ఉత్తరాయణం పుణ్యకాలం ప్రారంభం, మకర సంక్రాంతి
జనవరి 16 శుక్రవారం : కనుమ పండుగ

భోగి పండుగ మంగళవారం జనవరి 14వ తేదీన జరుపుకోనున్నారు. ప్రతియేటా సంక్రాంతి పండుగ భోగి పండుగతోనే ప్రారంభమవుతుంది. ఈ భోగి రోజు భోగి మంటలు వేస్తారు. ఉత్తరాయణ కాలం ప్రారంభమయ్యే ముందురోజు బాగా విపరీతంగా ఉండే చలిని తట్టుకునేందుకు తెల్లవారుజామునే భోగి మంటల్ని వేస్తారు. గోదాదేవి ధనుర్మాసం తొలి రోజు నుంచి తిరుప్పావై పాశురాలతో రంగనాథ స్వామిని ఆరాధించి భోగి పండుగ రోజే వివాహమాడి స్వామి వారిలో లీనమవ్వడం వల్లే ఈ భోగి పండుగ వచ్చిందనే కథ బాగా ప్రాచుర్యంలో ఉంది. అందుకే ధనుర్మాస వ్రతం భోగి పండుగతో ముగుస్తుంది. ఇక భోగి పండుగ రోజు ఆవు పేడతో చేసిన పిడకలతో కొత్త బెల్లం, కొత్త బియ్యం, ఆవు పాలతో పొంగలి చేసి సూర్యభగవానుడికి నివేదించడం ఆనవాయితీ. అలాగే భోగి రోజు సూర్యాస్తమయంలోపు చిన్న పిల్లలకు భోగిపళ్లు పోయడం కూడా మనం తరచూ చూసే ఓ సంప్రదాయమే. ఇక తెలంగాణలో అయితే భోగినోము పేరుతో ప్రత్యేక వ్రతం కూడా చేస్తారు. మట్టి కుండల్లో నువ్వుల ఉండలు, జీడిపళ్లు, చిల్లర డబ్బులు, చెరకు ముక్కలు వేసి వాటిని ఇరుగుపొరుగు వారికి, బంధుమిత్రులకు వాయినాలుగా ఇస్తారు.భోగి పండుగ మరుసటి రోజు వచ్చే పండుగే మకర సంక్రాంతి. సంక్రాంతి పండుగ జనవరి 15 గురువారం రోజుజరుపుకోనున్నారు.

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు కాబట్టి ఈ లేదా మకర సంక్రమణంగా పిలుస్తారు. ఈ రోజు నుంచీ ఉత్తరాయణ పుణ్యకాలం సంవత్సరం మొత్తం చేసే దానధర్మాలతో పోలిస్తే ఈ మకర సంక్రాంతి పండుగ రోజు గుమ్మడికాయ (కూష్మాండం) దానం చేయడం వల్ల పితృ దేవతలు సంతృప్తి చెంది సకల శుభాలు చేకూరుతాయని నమ్మకం. అలాగే నువ్వులు కూడా ఏదో ఒక రూపంలో సంక్రాంతి రోజు తీసుకుంటే ఆరోగ్యంతో పాటూ ఆయుష్షు పెరుగుతుందని చెబుతారు. ఇక తెల్ల నువ్వులు దేవతార్పణం కోసం, నల్ల నువ్వులు పితృతర్పణం ఉపయోగించాలని శాస్త్రాలు చెబుతున్నాయాయి. కనుమ పండుగను జనవరి 16 శుక్రవారం రోజు జరపుకోనున్నారు. సూర్యుడు మేష రాశిలోకి ప్రవేశించే రోజును కనుమగా భావించడం వల్లే ఈ కనుమ రోజును మేష సంక్రాంతిగా పిలుస్తారు.

ఇక ఈ కనుమ పండుగ అంతరార్థం ఏమిటంటే.. ఉపకారం చేసినవారికి ప్రత్యుపకారం చేయాలి అన్నదే కనుమ పండుగ అంతరార్థం. మానవ మనుగడకు మూలాధారమైన పశువులకు, జంతువులకు కృతజ్ఞతలు తెలియజేయడం ఈ కనుమ పండుగ ప్రధాన ఉద్దేశం. కనుమ పండుగ రోజు రైతులు ముందుగా పశుశాలను శుభ్రం చేసి గోవుల్నీ, గేదెల్ని కడిగి పసుపు రాసి కుంకుమ పెట్టి పూలమాలలతో అలంకరించి పూజిస్తారు. సాయంత్రం పూట మేళతాళాలతో ఊరేగిస్తారు.కుటుంబసమేతంగా సంక్రాంతి పండుగ జరుపుకుంటారు.

## ప్రతి నియోజకవర్గానికి ఒక ఒక జర్నలిస్టుకు కార్పొరేటర్ గా అవకాశం ఇవ్వాలి : సత్యం గౌడ్ డిమాండ్

**- ప్రతి సమస్యని మొదటగా గుర్తించేది జర్నలిస్టులే తీర్చేది జర్నలిస్టులే**
**- జర్నలిస్టుల సూచనలతోనే అధికారులు, ప్రజాప్రతినిధులు విధులు నిర్వహిస్తున్నారు**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈసారి జర్నలిస్టులకు అన్ని నియోజకవర్గాల్లో ఒక డివిజన్ కు కార్పొరేటర్ గా సముచిత అవకాశాలు కల్పించాలి అని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యంగౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియాకు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, అభివృద్ధి చేయడంలో ఒక జర్నలిస్టుకు తెలిసినట్టు మరి ఎవరికి తెలియదని,ప్రాంతీయ సమస్యలను ప్రభుత్వాల ముందుకు తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిని రాజకీయంగా ప్రోత్సహించడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని సత్యంగౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ నియోజకవర్గాల్లో ప్రజలతో నిత్యం మమేకమై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించగల సామర్థ్యం కలిగి ఉన్నారని,యూనిఫామ్ లేకుండా,జీతాలు లేకున్నా నిస్వార్థంగా ప్రజాసేవ చేసే జర్నలిస్ట్ లకు రాజకీయ అవకాశాలు కల్పిస్తే ప్రజలకు మరిన్ని సేవాలందించగలరని,ఇప్పటి వరకు కొన్ని నియోజకవర్గాలకే పరిమితమైన అవకాశాలు ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు అవకాశం ఇవ్వాలని రాజకీయ పార్టీలు ఆదిశగా ఆలోచించాలని, దీనివల్ల రాజకీయాల్లో అభివృద్ధి, పారదర్శకత పెరుగుతాయని జర్నలిస్ట్ సంఘాలు అభిప్రాయం వ్యక్తశీ చేస్తున్నాయని సత్యంగౌడ్ అన్నారు.ఈ అంశంపై రాజకీయ పార్టీల అధిష్టానాలు ఎలా స్పందిస్తాయో, జర్నలిస్టులకు వాస్తవంగా ఎలాంటి అవకాశాలు కల్పిస్తారో వేచి చూడాల్సి ఉంది. అయితే ఈ డిమాండ్ మాత్రం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటుందనే చెప్పాలి.

## ఎమ్మెల్యే డా.సంజయ్‌ను కలిసిన తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకులు



**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా కార్యవర్గం, జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టీ జే ఎస్ ఎస్) జగిత్యాల జిల్లా ఇంచార్జి, టీ జే ఎస్ ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల సంజయ్ రెడ్డి, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచమల్ల సుభాష్ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ను శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దారుకోట శేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్ .రాజేందర్, సంయుక్త కార్యదర్శులు సిగిరి రాజరెడ్డి, గిద్దె తిరుపతి, ముదాం శ్రీనివాస్, అనుమాండ్ల రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జంగా శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులు లింగా వెంకటేశ్వర్ రెడ్డి, కాసిరెడ్డి నాగరాజు, ఏనుగుల లక్ష్మినారాయణ, రాదే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణ చారిత్రక మైలురాయి: ఉత్తమ్ కుమార్ రెడ్డి

**- ఖరీఫ్ సీజన్‌లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**
**- గతంలో 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించినట్లు వెల్లడి**
**- రైతుల భాగస్వామ్యంతో రికార్డు సాధ్యమైందని వెల్లడి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయిని అధిగమించిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించినట్లు వెల్లడించారు.పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ జరుపుకుంటున్న రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకాలని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ఈ దిగుబడికి రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామని ఆయన అన్నారు.

## ఎమ్మెల్యే మల్లారెడ్డి.. ఇది మీకు భావ్యమేనా

**- మేడ్చల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ఎమ్మెల్యే మల్లారెడ్డి.. మీ ఇంజనీరింగ్ కళాశాలలో నుండి మురికి నీరు వచ్చి చెరువుల్లో కలుస్తున్నప్పటికీ నువ్వు పట్టించుకోకపోవడం బావ్యమా అంటూ మేడ్చల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి కి చెందిన ఇంజనీరింగ్ కళాశాలలో నుండి డ్రైనేజ్ నీరు సుమారు చెరువుతోపాటు సుతారి గూడా చెరువులో వదులుతూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం ఏమైనా పర్వాలేదు కానీ తమ కళాశాలలో నుండి వచ్చే డ్రైనేజీ నీటిని చెరువులో నింపుతామని ఎమ్మెల్యే మల్లారెడ్డి కంకణం కట్టుకుని ఉన్నారని వేముల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఎలాంటి ఎస్టీపీలు లేకుండానే నేరుగా డ్రైనేజ్ నీటిని చెరువుల్లోకి తరలిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. సీఎంఆర్ కాలేజ్, సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, సీఎంఆర్ హాస్పిటల్ నుండి ఎలాంటి ఎస్ టి పి ప్లాంట్ లేకుండా డ్రైనేజ్ మురుగు నీటిని నేరుగా సుతారిగూడ చెరువులోకి వదలడం సూచనీయమని దుయ్యబట్టారు. సుతారిగూడ నుండి మేడ్చల్ పెద్ద చెరువులోకి వచ్చి చేరుతుండడం వల్ల సాయంత్రం వేళ తీవ్ర దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అలాగే డ్రైనేజ్ నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అనేక రోగాలతో బాధపడుతున్నారని ఆరోపించారు.అంతేకాకుండా నిల్వ ఉన్న మురికి నీటిని చేపలు, పక్షులు, జంతువులు తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. చామకూర మల్లారెడ్డి ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని సీఎంఆర్ కళాశాలతో పాటు మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మేనేజ్ చేసుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రెండు ఏండ్లు ప్రజల మధ్యలో లేని మల్లారెడ్డి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల కోసం ప్రజల మధ్యకు వస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇకముందు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588